శ్రీమణవాళమహామునుల విషయంగా

కోయిల్ కందాడై అణ్ణన్ రచించిన

కణ్ణినుణ్‌శిఱుత్తామ్బు

ప్రతివాది భయంకరమ్ అణ్ణన్ రచించిన

అమలనాదిపిరాన్

(పాదాదికేశమాలై ప్రబంధం)

సవ్యాఖ్యానం

ప్రచురణ

ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి - 2012

కణ్ణినుణ్‌శిఱుత్తామ్బు, అమలనాదిపిరాన్ సవ్యాఖ్యానము

ప్రచురణ : ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్, తి.తి.దే., తిరుపతి

వెల : అమూల్యము.

మొదటి ముద్రణ : 2012

ప్రతులు : 2000

ప్రకాశకులు :

శ్రీ ఎల్.వి. సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్.

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి - 517 507

ముద్రణ :

తి.తి.దే. ముద్రణాలయం

తిరుపతి-517 507

నివేదన

"ఆచార్యదేవో భవ" (ఆచార్యుని దైవంగా కలవాడవు కావాలి), "దైవమివాచార్య ముపాసీత" (ఆచార్యుని దైవంవలె ఉపాసించాలి), **"ఆచార్య స్స హరి స్సాక్షాత్"** (ఆచార్యుడు సాక్షాత్తు ఆ హరియే) ఇత్యాది సూక్తులు ఆచార్యుడు దైవసమానుడని తెలుపుతున్నాయి. **"స హి విద్యాత స్తం జనయతి తత్ శ్రేష్ఠం జన్మ"** (అతడు-అంటే-ఆచార్యుడు విద్యద్వారా అతనిని - అంటే - శిష్యుని జన్మింప జేస్తున్నాడు. ఆ జ్ఞానజన్మ గొప్పది.), **"గరీయాన్ బ్రహ్మదః పితా"** (విద్యను ప్రసాదించే గురువు గొప్ప తండ్రి) అని మొదలైన ప్రమాణాలవల్ల శరీరోత్పత్తికి కారణమైన తండ్రికంటే జ్ఞానజన్మకు కారకుడైన గురువు అనే తండ్రి చాలా గొప్పవాడని, ఆ తండ్రివల్ల కలిగే శ్రేష్ఠమని తెలుస్తున్నది. **"యో దద్యాత్ భగవద్ జ్ఞానం ..... కృత్స్నాం వా పృథివీం దద్యాత్ న తత్ తుల్యం కథంచన"** (ఏ గురువు భగవానునకు సంబంధించిన జ్ఞానాన్ని ప్రసాదిస్తాడో, అతనికి సమస్తభూమిని సమర్పించినా ఏవిధంగానూ అతడు చేసిన ఉపకారానికి చాలదు.) అనే సూక్తివల్ల ఆచార్యుడు చేసిన మహోపకారానికి ప్రత్యుపకారం లేదని తెలుస్తున్నది. **"యస్య దేవే పరా భక్తిః యథాదేవే తథా గురౌ, తస్యైతే॒ కథితా హ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః"** (ఎవడు గురువు విషయంలో దైవం పట్ల ఉండే గొప్ప భక్తివంటి భక్తిని కలిగి ఉంటాడో, ఆ మహాత్మునకు గురువువల్ల అభ్యసించిన విషయాలే కాక, అభ్యసించని రహస్యాలు సైతం స్ఫురిస్తాయి) ఇత్యాది ప్రమాణాలవల్ల ఆచార్యుని పట్ల దైవప్రతిపత్తిని కలవానికి అన్ని అర్థాలు ప్రకాశిస్తాయని తెలుస్తున్నది. ఈ రీతిలో ఆచార్యవైభవాన్ని బహుముఖంగా పలు ప్రమాణాలు నిరూపిస్తున్నాయి.

శ్రీవైష్ణవసంప్రదాయంలో గొప్ప ఆచార్యులుగా పేరు పొందిన శ్రీమణవాళమహా మునులకు అష్టదిగ్గజాలనే ఎనిమిదిమంది ప్రధానశిష్యులు ఉండేవారు. వీరిలో కోయిల్ కందాడై అణ్ణన్ (వరదనారాయణ గురువు), ప్రతివాది భయంకరమ్ అణ్ణన్ అనే ఇద్దరు శిష్యులు తమ ఆచార్యులైన మణవాళమహామునుల విషయంగా రెండు ద్రావిడకృతులను రచియించి తమ ఆచార్యభక్తిని చాటుకొన్నారు. ఈ రెండు ప్రబంధాలలో ఒకటి అయిన **"కణ్ణినుణ్ శిఱుత్తామ్బు"** అనే ప్రబంధం కోయిల్ కందాడై అణ్ణన్‌కు గల చరమపర్వనిష్ఠను నిరూపిస్తున్నది. మధురకవులు అనే మహనీయులు తమ ఆచార్యులైన నమ్మాళ్వార్లే తమకు సమస్తం అని భావించి, ఆ భావాన్ని మధురంగా **"కణ్ణినుణ్ శిఱుత్తామ్బు"** అనే ప్రబంధంలో వ్యక్తం చేశారు. ఆరీతిగానే కోయిల్ కందాడై అణ్ణన్ తమకు సమస్తం తమ

ఆచార్యులైన వరవరమునులే అని భావించి, ఆ నిశ్చయాన్ని ప్రకృతప్రబంధంలో తెలిపినందువల్ల దీనికికూడా **"కణ్ణినుణ్ శిఱుత్తాంబు"** అనే పేరు ప్రసిద్ధి చెందింది. చరమపర్వ నిష్ఠ అంటే – ఆచార్యుడే ఉపాయము, అతని సేవే పరమార్థం అనే స్థిరమైన నమ్మికను కలిగియుండడం.

ఆళ్వార్లలో ఒకరైన తిరుప్పాణ్ అళ్వార్లు (మునివాహనసూరి) శ్రీరంగనాథుని దివ్యరూపాన్ని ఆపాదమస్తకం వర్ణిస్తూ **"అమలనాదిపిరాన్"** అనే దివ్యప్రబంధాన్ని అనుగ్రహించారు. ఈ విధంగానే ప్రతివాదిభయంకరమ్ అణ్ణన్ శ్రీమణవాళమహామునుల దివ్యరూపాన్ని వర్ణిస్తూ ఒక అందమైన ద్రావిడకృతిని రచించారు. అందువల్ల దీనికి కూడా **"అమలనాదిపిరాన్"** అనే పేరు ప్రసిద్ధి చెందింది. ఈ ప్రబంధంకూడా చాలా సుందరమైన కృతి. అణ్ణన్‌యొక్క చరమపర్వ నిష్ఠను చాటుతున్నవి.

ఈ రెండు ద్రావిడప్రబంధాలను వ్యాఖ్యానసహితంగా ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్, తి.తి.దే. సహృదయ పాఠకులకు అందిస్తున్నది. గతంలో ప్రాజెక్ట్ ముద్రించిన గ్రంథాలను పాఠకులు ఆదరించినట్లే దీనినికూడా ఆదరించి ఆనందిస్తారని నమ్ముతున్నాను. ఇటువంటి కృతులవల్ల ఆచార్యభక్తి, దైవవిశ్వాసం, ధర్మంపట్ల శ్రద్ధ పెంపొందుతుంది. సరళమైన భాషలో వ్యాఖ్యానాన్ని అందించిన శ్రీ డా॥ ఈ.ఏ. శింగరాచార్యులుగారిని, ఈ గ్రంథాన్ని ప్రాజెక్ట్ ద్వారా ముద్రించడానికి తగిన ప్రయత్నాన్ని చేసిన ప్రాజెక్ట్ స్పెషల్ ఆఫీసరు శ్రీ చొక్కలింగం గారిని అభినందిస్తున్నాను.

శ్రీ ఎల్.వి. సుబ్రహ్మణ్యం, ఐ.ఏ.ఎస్.
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

పురో వాక్

సకలవేదాంతసారార్థపూర్ణాశయం విపులవాధూలగోత్రోద్భవానాం వరమ్ ।
రుచిరజామాతృయోగీంద్రపాదాశ్రయం వరదనారాయణం మద్గురుం సంశ్రయే॥

(సకల వేదాంతాలలోని సారార్థాలతో నిండిన హృదయాన్ని కలవారు, గొప్ప వాధూలవంశములో పుట్టినవారిగా గొప్పవారు. అందమైన మణవాళమహామునుల శ్రీచరణాలను ఆశ్రయించినవారైన నా గురువులు వరదనారాయణులను ఆశ్రయిస్తున్నాను.)

యతివరపునరవతారభూతులుగా కీర్తింపబడే మణవాళమహామునులకు గల పలువురి శిష్యులలో **"పారారుమజ్జై తిరువేఙ్గడముని పట్టర్‌పిరాన్ ఆరామమ్ శూழ్‌కోయిఱ్ఱాన్దై యణ్ణ నెఱుమ్బియప్పా ఏరారు మప్పిళ్ళై యప్పుళ్ళార్ వాది భయంకరన్ పేరార్న్ద దిక్కయమ్ శూழ్‌వరయోకియై చ్చిన్దియుమే"** (తిరువేఙ్గడ రామానుజ జీయర్, వానమామలై జీయర్, పట్టర్ పిరాన్ జీయర్, కోయిల్ కన్దాడై అణ్ణన్, ఎఱుమ్బియప్పా, అప్పుళ్ళార్, అప్పిళ్ళై, ప్రతివాది భయంకరమ్ అణ్ణన్ అనే గొప్పకీర్తిని కల అష్టదిగ్గజాలతో కూడియుండే శ్రీవరవరములను ధ్యానిస్తున్నాము.) అని యతీంద్ర ప్రవణప్రభావంలో నిర్దేశింపబడిన రీతిలో అష్టదిగ్గజాలుగా కీర్తింపబడే ఎనిమిది మంది ప్రముఖులు. వీరిలో కోయిల్‌కన్దాడై అణ్ణన్ అనబడే వరదనారాయణులు అగ్రగణ్యులు. భగవద్రామానుజులకు ముదలియాణ్డాన్‌వలె వీరు కూడా మణవాళమహామునులకు అనవరతం అంతరంగ కైంకర్యం చేసేవారు. ఆ ముదలియాణ్డాన్ వంశానికి చెందినవారుకూడా. ఈ విషయం యతీంద్రప్రవణప్రభావంలో **"రామానుజమునీంద్రస్య శ్రీమాన్ దాశరథిర్యథా" - ఎన్నుమ్బడి, ఉడైయవరుక్కు ముదలియాణ్డానైప్పోలే అత్యంతప్రీతి విషయరాయిరుప్పర్"** (శ్రీరామానుజులకు ముదలియాణ్డాన్‌వలె, కోయిల్ కన్దాడై అణ్ణన్ శ్రీవరవరమునులకు మిక్కిలి ప్రీతిపాత్రులు) అని తెలుపబడింది. కోయిఱ్ఱాన్దై యణ్ణన్ పురుషకారంతోనే ఎఱుమ్బియప్పా, ప్రతివాది భయంకరం అణ్ణన్ వరవరమునులను ఆశ్రయించారు. అందువల్ల ప్రతివాదిభయంకరం అణ్ణన్ తమ వరవరమునిశతకంలో వరవరమునుల శిష్యులలో వీరు ప్రధానులని అనగా, ఎఱుమ్బియప్పా తమ వరవరముని శతకంలో **"వరవరమునివర్యపాదురత్నం వరదగురుం సమాశ్రయే గురూణామ్, ఉపనిషదుపగీత మర్థతత్త్వం తదిహ**

యదీయవశంవదం సమింధే" (ఉపనిషత్తులలో తెలుపబడిన ఆ అర్థతత్త్వం ఎవరి అధీనమై ప్రకాశిస్తున్నదో, వరవరమునుల పాదుకాస్థానీయులైన గురువులకు గురువులైన శ్రీవరదనారాయణులకు ఆశ్రయిస్తున్నాను) అని, **"ప్రేమస్థానం వరవరమునేః సంతు సంతః శతం తే తుల్యాః కో వా వరదగురుణా తేషు నారాయణేన"** (శ్రీవరవరమునుల అభిమానానికి పాత్రులైనవారు వందల కొలది ఉన్నా, వారిలో వరదనారాయణులనబడే కందాడై అణ్ణన్‌తో సమానులు ఎవరు?) అని ఈ రీతిగా పలుమార్లు వీరి ప్రాముఖ్యాన్ని ఉగ్గడించారు. శ్రీరంగనాథుడు వీరిని ప్రేమగా **"అణ్ణా"** అని పిలిచి ఆదరించినందువల్ల, శ్రీరంగంలో వీరు నిత్యవాసం చేసినందువల్ల, కందాడైవంశంలో అవతరించినందువల్ల వీరికి **"కోయిల్ కన్దాడై అణ్ణన్''** అనే తిరునామం ప్రసిద్ధమయింది. **"శ్రీరమ్యవరమౌనీంద్ర శ్రీపాదాబ్జమధువ్రతమ్, వృషభే మైత్రభే జాతం వరదార్య మహం భజే"** (వృషభ మాసంలో అనూరాధ నక్షత్రంలో అవతరించినవారు, శ్రీవరవరమునుల పాదాలు అనే తామరపూవులో నిత్యవాసం చేసే తుమ్మెదవంటివారైన శ్రీవరదనారాయణులను సేవిస్తున్నాను) అనే తనియన్ శ్లోకాన్నిబట్టి వైయ్యాశి నెల అనూరాధా నక్షత్రంలో అవతరించినట్లు తెలుస్తున్నది.

శ్రీరంగనాథుని ఆజ్ఞానుసారం శ్రీవరవరమునులను అణ్ణన్ ఆశ్రయించిన వైనాన్ని యతీంద్రప్రవణప్రభావగ్రంథం ఈ విధంగా తెలిపింది- **"ఇతు కణ్డు కన్దాడైఅణ్ణన్ ముదలాన్‌ోర్ ఇవర్ తిరువడికళిల్ ఆశ్రయిణోన్ముఖరాయిరుక్క, అవ్వళవిలే పెరుమాళుమ్ అవర్‌కళ్ స్వప్నత్తిలే "అసంకుచిత మాచక్ష్వే భుజంగ శయనః పుమాన్" ఎన్గిఱపడియే విశదమాక జీయర్‌తిరువడికళిలే ఆశ్రయిక్కుమ్బడి నియమిత్తరుళ, అవర్‌తిరుముకప్పడియే "రామానుజపదాంభోజసాగంధ్య నిధయోఽపి యే"** అని ప్రారంభించి, **"శ్రుత్వైవ వైభవం తస్య తత్త్వేన శరణం యయుఃఎన్గిఱపడియే రామానుజపరిగృహీతరాయ్, అభిజనవిద్యావృత్తజ్ఞాలుమ్ ఉయర్‌న్దిరుక్కుమవర్‌కళాన కన్దాడై అణ్ణన్ ముదలాన ఆచార్యపురుషర్‌కళాయుళ్ళ అనైవర్‌కళుమ్ తన్దా ముయర్‌త్తికళై ప్పారామల్ ఇవర్ తిరువడికళిల్ సంబంధమే తమక్కు ధారక మెన్ఱు అఱుదియిట్టు వన్దు జీయర్ తిరువడికళై శరణమాక ప్పఱ్ఱి ఉజ్జీవిత్తార్‌కళ్"** (దీన్ని చూచి కన్దాడై అణ్ణన్ మొదలైనవారు వీరి శ్రీపాదాలను ఆశ్రయించడానికి సుముఖులుగా ఉండగా,అపుడు శ్రీరంగనాథుడు కూడా వారికి స్వప్నంలో "ఆదిశేషునిపై పరుండి ఉండే పరమపురుషుడు విశదంగా

మణవాళమహామునుల గొప్పతనాన్ని తెలిపాడు'' అనే రీతిలో విశదంగా జీయర్‌శ్రీ పాదాలను ఆశ్రయించేట్లు నియమించగా, వారి ఆజ్ఞానుసారం ''ఎవరు రామానుజుల పాదారవిందాల పరిమళానికి స్థానమో ఆ మణవాళ మహామునుల వైభవాన్ని యథాతథంగా వినిన తర్వాత వారిని రక్షకంగా ఆశ్రయించారు'' అనే రీతిలో రామానుజులచేత ఆదరింపబడ్డవారై, అభిజన-విద్యా- శీలాదులతో ఉన్నతులైన కన్దాడై అణ్ణన్ మొదలైనవారు తమ గొప్పతనాలను లెక్కచేయకుండా వీరి శ్రీపాదసంబంధమే తమకు ధారకం అని నిశ్చయించుకొని వచ్చి, జీయర్ శ్రీపాదాలనే శరణంగా ఆశ్రయించి, ఉజ్జీవించారు.) శ్రీవరవరమునుల ఆజ్ఞానుసారం అణ్ణన్ ఈడువ్యాఖ్యను వరవరమునుల పౌత్రులైన జీయర్‌నాయనార్‌కు అనుగ్రహించినట్లు యతీంద్ర ప్రవణప్రభావం తెలుపుతున్నది. ఆచార్యపరంపరలో మణవాళమహామునుల తనియన్‌కు తరువాత వీరి తనియన్ అనుసంధింప బడుతున్నది.

వరవరమునుల విషయంలో తమకున్న అపరిమితప్రావణ్యాన్ని అణ్ణన్ ఈ **"కణ్ణినుణ్ శిఱుత్తామ్బు"** ప్రబంధంద్వారా వ్యక్తీకరించారు. మధురకవులు శఠకోపుల విషయంలో తమకు గల అత్యంతభక్తిని **"కణ్ణినుణ్ శిఱుత్తామ్బినాల్"** అని ప్రారంభం అయే మధురంలో ప్రబంధంలో ప్రకటించినందున ఆప్రబంధానికి **"కణ్ణినుణ్ శిఱుత్తామ్బు"** అనే పేరు స్థిరపడింది. ఈ ప్రబంధం ఆ విధమైన పదప్రయోగంతో ప్రారంభం కాకున్నా కణ్ణినుణ్ శిఱుత్తామ్బు ప్రబంధంవలె ఆచార్యభక్తిని ప్రకటించేది కాబట్టి దీనినికూడా పెద్దలు ఆ పేరుతోనే వ్యవహరించారు. ఈ ప్రబంధంలో కట్టళైక్కలిత్తుఱై అనే ఛందస్సులో రచింపబడ్డ 13 పాశురాలున్నాయి. మృదు మధురం అయిన ఈ ప్రబంధం కోయిల్ కందాడై అణ్ణన్ ద్రావిడభాషాకవితాసామర్థ్యాన్ని నిరూపిస్తున్నది. నిత్యానుసంధేయశ్లోకాల్లో ఒకటి అయిన **"రామానుజార్యదివ్యాజ్ఞా ప్రతివాసర ముజ్జ్వలా, దిగంతవ్యాపినీ భూయాత్ సా హి లోకహితైషిణీ"** (శ్రీరామానుజుల దివ్యాజ్ఞ ప్రతిదినం మిక్కిలి ప్రకాశిస్తున్నదై దిగంతాలకు వ్యాపించాలి. అది లోకహితాన్ని కోరేది కదా!) అనే ముక్తకశ్లోకం అణ్ణన్‌కృతంగా ప్రసిద్ధం. వరవరమునులనుగూర్చి వీరు వా**ళ్ఱి**త్తిరు నామాన్ని, వరవర మున్యష్టకాన్నికూడా రచించారు.

ఉత్తమోపాయం అయిన చరమపర్వనిష్ఠను ప్రతిపాదించే ఈ ప్రబంధం ప్రాచీన పెద్దనిత్యానుసంధానశ్రీకోశాలలో, వ్యాఖ్యానసహిత నిత్యానుసంధాన

కోశాలలో చోటు చేసికొన్నా, ఈమధ్యకాలంలో ప్రచురింపబడే నిత్యానుసంధాన కోశాలలో కన్పించకపోవడం వల్ల, ఈ తరంవారికి ఇది అపరిచితంగా మిగిలిపోయే స్థితి ఏర్పడింది. అందువల్ల ఈ రుచిరప్రబంధాన్ని మఱొక్కమారు వెలుగులోకి తీసికొనిరావాలనే ఉద్దేశ్యంతో ప్రకృతప్రయత్నం చేయబడింది. ప్రస్తుతవ్యాఖ్యానం సుప్రసిద్ధవిద్వాంసులు, కీర్తిమూర్తులు, తిరుపతి వాస్తవ్యులు' **న్యాయవేదాంతవిద్వాన్, శ్రీవైష్ణవసింహ, ఉ.వే.శ్రీమాన్ టి.ఏ కృష్ణమాచార్యస్వామివారు** ద్రావిడంలో అనుగ్రహించిన వ్యాఖ్యను కృతజ్ఞతాపూర్వకంగా అనుసరిస్తూ వ్రాయబడింది. సహృదయ పాఠకులు ఇందులోని గుణాలను గ్రహించి, దోషాలను విడచిపెట్ట వలసినదిగా కోరుతున్నాను.

ఇట్లు

ఈ. ఏ. శింగరాచార్యులు.

శ్రీమణవాళమహామునులవిషయంగా
కోయిల్‌కన్దాడై అణ్ణన్ అనుగ్రహించిన

కణ్ణినుణ్ శిఱుత్తామ్బు

(మణవాళమహామునులు అనుగ్రహించిన తనియన్)

ఎక్కుణత్తోర్ ఎక్కులత్తోర్ ఎవ్వియల్‌వోర్ ఆయిడినుమ్
అక్కణత్తే నమ్మైయవరావరే - మిక్క పుకழ్
క్కారార్‌పొழిల్ కోయిల్ కన్దాడై యణ్ణనెనుమ్
పేరాళనై యడైన్ద పేర్

మిక్క పుకழ్ =మిక్కిలి (పూర్ణం అయిన) కీర్తిని కలవారై, కార్ ఆర్ పొழిల్= మేఘాలు సంచరించే (నిలచి ఉండే) తోటలచేత పరివేష్ఠితం అయిన, కోయిల్ = శ్రీరంగాన్ని నిరూపకంగా కలవారై, కన్దాడై = కన్దాడైకులంలో అవతరించినవారై, అణ్ణన్ ఎనుమ్ = అణ్ణన్ అని ప్రసిద్ధిని పొందినవారైన, పేరాళనై= మహానుభావులను, ఎక్కుణత్తోర్ ఆయినుమ్ = ఎటువంటి చెడ్డగుణాలను కలవారై ఉన్నా, ఎక్కులత్తోర్ ఆయినుమ్ = ఏవిధమైన తక్కువ కులంలో జన్మించినవారైనా, ఎవ్వియల్‌వోర్ ఆయిడినుమ్ = ఎటువంటి తగని స్వభావాన్ని కలవారై ఉన్నా, అక్కణత్తే =అణ్ణన్‌ను ఆశ్రయించిన ఆ క్షణంలోనే, నమ్ ఇఱైయవర్= మాకు స్వాములుగా, ఆవర్ ఏ = కాగలరు అన్నది నిశ్చయం. (ఏకారం నిశ్చయార్థకం)

ఉన్నతవంశంలో పుట్టుక, దానికి తగిన జ్ఞానభక్తివైరాగ్యాది సద్గుణాలు, వాటితో చేరిన మంచి ప్రవర్తన - అనే వీటిచేత మిక్కిలి కీర్తిని సంపాదించినవారు, కోయిఱ్కున్దాడై అణ్ణన్ అనే విశిష్టనామంతో వ్యవహరింపబడే మహనీయులు. వీరిని శరణంగా ఆశ్రయించిన ఒక వ్యక్తి తక్కువ కులంలో జన్మ, దుర్గుణాలు, తగని ప్రవర్తన - అనే వీటిని కల్గినవాడైనా, అణ్ణన్‌కు ఆశ్రయించిన ఆ క్షణంలోనే వారి మధురమైన కృపచేత దోషం అంతా తీరి ఔన్నత్యాన్ని పొందుతాడు. కాబట్టి, మణవాళమహామునులు అణ్ణన్‌ను తమ దాసులుగా చేసుకొన్నారు.

భగవత్సమాశ్రయణాన్ని చేసినవారినే ఆழ్వార్లు **"పరమనై ప్పయిలుమ్ తిరువుడైయార్ యవరేలుమ్ అవర్ కణ్డీర్ ఎమ్మై యాళుమ్ పరమర్"** (పరమాత్మను కీర్తించే సిరిని కలవారు ఎవరైనా వారేసుమా, మమ్ములను పాలించే గొప్పవారు), **"ఆழ్పిప్పిరాన్ తన్నై పణియుమవర్ కణ్డీర్ ఎమ్మై యాళుడై నాదర్"** (శ్రీసుదర్శన

దారిని సేవించేవారే సుమా మమ్ములను పాలించే నాథులు.) ఇత్యాదిగాను, **"కడల్ మల్లైత్తలైశయనత్తుఱైకిట్ట ఞానత్తినొళియురువై నినైవార్ ఎన్ నాయకర్"** (కడల్ మల్లైత్తలైశయనం అనే దివ్యదేశంలో నివసించే జ్ఞానస్వరూపుడైన పరమాత్మను ధ్యానించేవారు మా నాయకులు.), **"కడల్‌మల్లై త్తలైశయనత్తుఱైవారై క్కొణ్డాడుమ్ నెఞ్చుడైయార్ అవర్ ఎఙ్గళ్ కులదెయ్వమ్"** (కడల్ మల్లైత్తలైశయనమ్ అనే క్షేత్రంలో నిత్యవాసం చేసే స్వామిని కీర్తించే మనసు కలవారు మా కులదైవం) ఇత్యాదిగాను తమకు స్వాములు అని అనుగ్రహించగా, పరమభాగవతులైన అణ్ణన్‌ను ఆశ్రయించినవారిని మామునులు తమకు స్వాములుగా అనుగ్రహించడం కింపునఃన్యాయసిద్ధంకదా! ఈ తనియన్ యతీంద్రప్రవణప్రభావంలో కన్పిస్తున్నది.

ఈ తనియన్‌ను ఆచార్యులైన మణవాళమహాములు తమ శిష్యులైన కోయిల్‌అణ్ణన్‌నుగూర్చి అనుగ్రహించారు. మణవాళమహాముల దృష్టిని బట్టి చూస్తే మామునులు తమకు తమకు సబ్రహ్మచారి అయిన అణ్ణన్‌కు తనియన్‌ను అనుగ్రహించారనికూడా చెప్పవచ్చు. **"తాన్ హితోపదేశమ్ పణ్ణువ్వొదు తన్నైయుమ్, శిష్యనైయుమ్, ఫలత్తైయుమ్ మాఱాడి నినైక్కై క్రూరనిషిద్ధమ్"** (శ్రీవచన-308) (తాను హితోపదేశం చేసేటప్పుడు తనను, శిష్యుని, ప్రయోజనాన్ని వేరేవిధంగా భావించడం చాలా నిషిద్ధం) అని శ్రీపిళ్ళైలోకాచార్యులవారు అనుగ్రహించిన తీరులోనే, ఆచార్యుడు తన శిష్యుని తనకు శిష్యునిగా తలచకుండా తన ఆచార్యుని శిష్యునిగానే - అంటే తనకు సబ్రహ్మచారిగానే భావించాలి. కాబట్టి శ్రీవచనభూషణంలోని గంభీరార్థాలను అన్నిటినీ గ్రహించి, ఆ సూక్తి క్రమంలో అనుష్ఠించేవారిలో మామునులు ఒకరు కనుక, అణ్ణన్‌ను తమకు సబ్రహ్మచారిగా భావించడం తగినదే కదా!

"తన్నాశిరియన్ తన్నోడు కఱ్ఱోన్ తన్మాణాక్కళ్ తకు మురైకారన్ ఎన్ఱిన్నోర్ పాయిర మియమ్బుదల్ కడనే" (తన ఆచార్యులు, తనతో కలసి అధ్యయనం చేసిన సబ్రహ్మచారి, తన శిష్యులు - అని వీరు తనియన్‌ను రచించడానికి అర్హులు) (నన్నూల్-51) అని చెప్పబడ్డ రీతిలో ఆచార్యుడు తన శిష్యునకు తనియన్ అనుగ్రహించడం, సబ్రహ్మచారులిద్దఱిలో ఒకరు ఇంకొకరికి తనియన్ వ్రాయడం యుక్తమే. **"తన్నోడు కఱ్ఱోన్"** అంటే సబ్రహ్మచారి.

శ్రీమణవాళమహాములవిషయంగా
కోయిల్‌కన్దాడై అణ్ణన్ అనుగ్రహించిన

కణ్ణినుణ్ శిఱుత్తామ్బు

అవ :- కోయిలణ్ణన్ ఈ మొదటి పాశురంలో సదాచార్యసంబంధాన్ని పొందిన మణవాళమహాములను తాము అగతికులై ఆశ్రయించిన వైనాన్నిగూర్చి అనుగ్రహిస్తున్నారు.

శీరుఱ్ఱ శెఞ్జొల్ తిరువాయ్‌మొళిప్పిళ్ళై శెమ్ముకముమ్
తారుఱ్ఱ మార్బుమ్ తళిరేయ్ పదఙ్గళుమ్ తమ్మనత్తు
పూరిత్తు వాళుమ్ మణవాళ మాముని పొన్నడికళ్
పారిల్ తనిత్త అడియేన్ శరణెన్ఱు పఱ్ఱిననే

శీర్ ఉఱ్ఱ = గొప్పతనాన్ని కల్గిన, శెమ్ శొల్ = సత్యమైన శ్రీసూక్తులను అనుగ్రహిస్తున్న, తిరువాయ్‌మొళిప్పిళ్ళై = తిరువాయ్‌మొళిప్పిళ్ళై అనే తమ ఆచార్యుల, శెమ్ ముకమ్ = ఎఱ్ఱని (అందమైన) తిరుముఖమండలాన్ని, తార్ ఉఱ్ఱ = తామరపూసల, తులసిపూసల దండలను పొందికగా కల, మార్బుమ్ = వక్షఃస్థలాన్ని, తళిర్ ఏయ్ పదఙ్గళుమ్ = చిగురుతో పాటి వచ్చే వారి శ్రీపాదాలను, తమ్ మనత్తు = శిష్యులైన తమ మనస్సులో, పూరిత్తు = నిండిస్తూ(ధ్యానిస్తూ), వాళుమ్ = ఆనందిస్తున్న, మణవాళమాముని పొన్ అడికళ్ = మణవాళ మహాముల బంగారంవలె అభిలషించతగిన శ్రీపాదాలను, పారిల్ = ఈలోకంలో, తనిత్త = వేఱు ఉపాయం, గతి లేకుండా అనన్యగతికునిగా ఉన్న, అడియేన్= దాసుడనైన నేను, శరణ్ ఎన్ఱు = ఇవే మనకు రక్షకం అని, పఱ్ఱినేన్ = స్థిరమైన నమ్మకంతో ఆశ్రయించాను.

తిరువాయ్‌మొళిప్పిళ్ళై శ్రీసూక్తులు గొప్పవి, సత్యమైనవి. **"శెమ్మై"** అంటే భవిష్యత్తులో మంచినికల్గించే స్వభావం. యథార్థాన్ని తెలిపే స్వభావం. **"శీర్"** అంటే వినేటపుడు మధురంగా ఉండేవి. **"శీరుఱ్ఱ"** అనే విశేషణాన్ని తిరువాయ్‌మొళిప్పిళ్ళైకు విశేషణంగా చేసి "కల్యాణగుణాలతో పూర్ణులైన" అనే అర్థాన్ని కూడా చెప్పవచ్చు.

'తిరువాయ్‌మొళిప్పిళ్ళై''- వీరు శ్రీపిళ్ళైలోకాచార్యులవారి శిష్యులు. శ్రీశైలేశులు, తిరుమలైయాళ్వార్ అనే తిరునామాలతో ప్రసిద్ధిని పొందిన వీరు, ఆళ్వార్లు అనుగ్రహించిన తిరువాయ్‌మొళిప్రబంధంలో అత్యంతాభినివేశాన్ని కల్గినవారు కావడంవల్ల తిరువాయ్‌మొళిప్పిళ్ళై- అనే పేరుతో వ్యవహరింపబడ్డారు.

వీరు మణవాళమహామునులకు సాక్షాదాచార్యులు. వీరే శ్రీమణవాళ మహామును లకు భగవద్రామానుజులపట్ల ఉత్కటమైన భక్తిని కలుగజేసి తన్మూలంగా యతిరాజవింశతి స్తోత్రరచనకు కారణభూతులయ్యారు. **"శ్రీమన్! యతీంద్ర! తవ దివ్యపదాబ్జసేవాం, శ్రీశైలనాథకరుణాపరిణామదత్తామ్"** అని యతిరాజవింశతిలో మణవాళమహామునులు ఈ అంశాన్ని తెలిపారు. ఇటువంటి గొప్పతనాన్నికల తిరువాయ్‌మొళి పిళ్ళై తిరుముఖం, వక్షఃస్థలం శ్రీపాదాలు - అనే వీనిని సదా ధ్యానం చేసి, ఆనందించే మణవాళమహామునులను కోయిలణ్ణన్ తాము శరణంగా ఆశ్రయించిన విషయాన్ని ఇందులో తెలియజేశారు. **"తేశారుమ్ శిచ్చన్ అవన్ శీర్‌వడివై"** (తేజస్సు నిండిన శిష్యుడు గురువు యొక్క గొప్ప రూపాన్ని ధ్యానించాలి) అనే ఉపదేశరత్నమాలై సూక్తిని అనుసంధేయం. **"పొన్"** (బంగారం) తనను అలంకరించుకొన్నవారికి తాను ప్రాప్యమై, రత్నాలు మొదలైన అమూల్యవస్తువులను పొందడానికి ఉపాయమై ఉన్నట్లే, శ్రీమణవాళమహామునుల శ్రీపాదాలుకూడా స్వయంప్రాప్యంగాను భగవానుని, భగవద్రామానుజులను పొందడంలో ఉపాయం గాను ఉండడంవల్ల మామునుల పాదాలు **"పొన్నడికళ్"** అని అనబడ్డాయి. ఇక, పావనత్వంలో, భోగ్యత్వంలో సువర్ణంతో సమానం కాబట్టి వారి శ్రీపాదాలు **"పొన్నడికళ్"** అని అనబడ్డాయి - అని అనడంలో కూడా ఔచిత్యం ఉన్నది. అచ్యుత పదాంబుజ యుగ్మరుక్మవ్యామోహాన్ని కలవారు శ్రీరామానుజులు కాగా, ఆచార్య పదాంబుజ యుగ్మరుక్మవ్యామోహాన్ని కలవారు అణ్ణన్. **"శరణ్"** - ఇష్టప్రాప్తి - అనిష్టనివారణరూప రక్షణానికి ఏ లోటు లేని ఉపాయం.

అవ:- తాము మణవాళమహామునులను ఆశ్రయించడానికి గల కారణాన్ని ఇందులో అణ్ణన్ తెలుపుతున్నారు. వారి ముఖోల్లాసంకోసం తిరువాయ్‌మొళిపిళ్ళై శ్రీచరణాలను శరణాగతి చేస్తున్నారు.

2. పఱ్ఱినన్ శెమ్మై త్తిరువాయ్‌మొళిప్పిళ్ళై ప్పాదజ్గళ్
ఉఱ్ఱనన్ శెమ్ మఱైయుళ్ళ దెల్లా మివై యుణ్మై యెన్ఱే
కఱ్ఱనన్ కోయిల్ మణవాళమాముని క్కార్‌ముకిలై
పెఱ్ఱనన్ ఇజ్గడియేన్ ఇనిమేల్ పిఱవామలుక్కే

అడియేన్ = దాసుడను అయిన నేను, శెమ్మై = ఎట్టని, తిరువాయ్ మొళిపిళ్ళై పాదజ్గళ్ = తిరువాయ్‌మొళిపిళ్ళై శ్రీచరణాలను, పఱ్ఱినన్ = శరణంగా ఆశ్రయించాను. శెమ్ మఱై = ఋజువైన వేదాలలో, ఉళ్ళదు ఎల్లామ్= ఇపుడు అధ్యయనం చేయబడుతున్న శాఖలు అన్నిటిని, ఉవై ఉణ్మై ఎన్ఱు ఏ =

ఇవి అన్నీ యథార్థాన్ని ప్రతిపాదించేవి అని భావించే, ఉఱ్ఱనన్ = ఊనికను కల్గినవాడనై, కఱ్ఱనన్ = అభ్యసించాను, ఇని మేల్ = ఇకపై వచ్చే దినాలలో, ఇఱ్ఱు పిఱవామలుక్కు= ఈ లోకంలో పుట్టకుండా, పరమపదాన్ని పొందడానికి, కోయిల్ మణవాళమాముని కళ్ = శ్రీరంగంలో నిత్యవాసం చేసే మణవాళమహామునులు అనే, కార్ ముకిలై = జలపూర్ణం అయిన మేఘాన్ని, పెఱ్ఱనన్ = ఆచార్యునిగా ఆశ్రయించాను.

"మఱై" (వేదం) అనే పదం శిక్షా మొదలైన షడంగాలకు, మీమాంస మొదలైన ఎనిమిది ఉపాంగాలకు ఉపలక్షకం. **"మఱై యుళ్ళదెల్లామఱ్ఱైయుమ్ కఱ్ఱనన్"** అనే ప్రయోగంద్వారా అణ్ణన్ తమ విద్వాన్వైభవాన్ని తెలుపుతున్నారని భావించరాదు. మఱి ఈ ప్రయోగంలోని తాత్పర్యం ఏమంటే - వేదాల్లో ప్రతిపాదింపబడే భక్తిమార్గం, ప్రపత్తిమార్గం జీవాత్మయొక్క స్వరూపం అయిన భగవత్పారతంత్ర్యానికి విరుద్ధాలు కాబట్టి, భగవానుడే ఉపాయం అనే మహావిశ్వాసం కల్గడం దుర్లభం కాబట్టి, అది నిష్ఫలం కాగా, వేదాధ్యయనాదులతో మాత్రమే మోక్షం సిద్ధించే అవకాశం లేదు -అని తెలుపడంకోసం ఈ ప్రయోగం చేయబడింది.

ఇంత నేర్చినా, మోక్షం కలిగే దారి లేదనే విషయం గ్రహించిన తరువాత, అందుకోసం మణవాళమామునులను ఆశ్రయించాను - అని కవి అంటున్నారు. **"పిఱవామలుక్కే మణవాళమాముని క్కార్‌ముకిలై పెఱ్ఱనన్"** అనే ప్రయోగం ద్వారా మామునులు మోక్షాన్ని అనుగ్రహించడం తథ్యం - అని తెలుపడంకోసం వారిని **"కార్ ముకిల్"** అని అన్నారు. నీటిని నిండుగా కల మేఘం వర్షిస్తుంది అనే విషయం ఏ విధంగా తథ్యమో, ఆ రీతిలోనే మామునులు **"నీర్‌మై"** (కరుణ)ను కలవారు కనుక, అగతికులైనవారికి మోక్షాన్ని అనుగ్రహించడం తథ్యం- అన్నది ఇచటి తాత్పర్యం. **"భక్తియిల్ అశక్తనుక్కు ప్రపత్తి, ప్రపత్తియిల్ అశక్తనుక్కు ఇదు"** (ఆచార్యాభిమానం) అని వచించారుకదా శ్రీవచనభూషణంలో శ్రీపిళ్ళైలోకా చార్యులవారు.

శ్రీకూరేశులు శ్రీవైకుంఠస్తవంలోని మొదటి శ్లోకంలో **"రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే"** అని భగవద్రామానుజులను శరణాగతి చేసి, వారి ముఖోల్లాసం కోసం **"సంశ్రయేమ వకుళాభరణాంఘ్రియుగ్మమ్"** అని అంటూ రెండవ శ్లోకంలో నమ్మాళ్వార్లను శరణాగతి చేసినట్లే, అణ్ణన్‌కూడా మొదటి పాశురంలో మామును లను శరణాగతి చేసి, వారి ఆనందంకోసం తిరువాయ్‌మొళిపిళ్ళైను రెండవ పాశురంలో శరణాగతి చేస్తున్నారని చెప్పవచ్చు.

అవ:-తాము ఆశ్రయించిన మణవాళమామునులకు తిరువాయ్‌మొళిప్పిళ్ళై మధురమైన కృపచేత లభించిన భగవద్రామానుజుల శ్రీచరణాలలోని ప్రావణ్యాన్ని గూర్చి చెప్పి, అటువంటి యతీంద్రప్రవణులైన మామునులను అందరూ మంగళాశాసనం చేయవలసి ఉండగా, ఆ రీతిలో చేయనివారిని ఇందులో నిందిస్తున్నారు.

3. పిఱవామల్ వాళ్‌విక్కుమ్ పేరరుళాళర్ పెరుమై యెన్ఱుమ్
తుఱవాద శిన్నై యెతిరాశన్ తుయ్యపదజ్గళ్ నెఞ్జిల్
మఱవాద శీలన్ మణవాళమాముని మామలర్‌త్తాళ్
పఱైయాద వాశకర్ యార్ అవర్ పఞ్ఞమాపాతకరే

పిఱవామల్ = ఈ భూమిలో జన్మించి, దుఃఖించకుండా ఉండేటట్లు, వాళ్‌విక్కుమ్ = మోక్షానందాన్ని అనుగ్రహించడానికి కారణం అయిన, పేరరుళాళర్= పూర్ణమైన కృపను కలవాడైన శ్రీకాంచీ వరదరాజస్వామియొక్క, పెరుమై = మహిమలను, ఎన్ఱుమ్ తుఱవాద = ఎల్లప్పుడూ విడవకుండా అనుసంధించే, శిన్నై= మనస్సును గల, ఎతిరాశన్ = భగవద్రామానుజుల, తుయ్య పదజ్గళ్ = పరిశుద్ధాలైన శ్రీపాదాలను, నెఞ్జిల్ మఱవాద = తమ మనస్సులో మఱువకుండా ఉండే, శీలన్= స్వభావాన్ని కల, మణవాళమాముని = శ్రీమణవాళమహామునులయొక్క, మా మలర్= ఎఱ్ఱని తామరలవంటి, తాళ్ = శ్రీచరణాలను, పఱైయాద = స్తుతించని (చాటింపు వేయని), వాశకర్ = పలుకులను కలవారు, యార్ = ఎవరో, అవర్ = వారు, పఞ్ఞ మా పాతకరే = అయిదు గొప్ప పాపాలను చేసినవారే కాగలరు.

భగవద్రామానుజులకు తిరుక్కచ్చినమ్బి మూలంగా ఆఱు వార్తలను అనుగ్రహించి, తన్మూలంగా పెరియనంబి శ్రీపాదాలలో వారిని ఆశ్రయింపజేసి, వారిని, ఆ రామానుజుల శ్రీచరణసంబంధంద్వారా లోకులను అందఱినీ ఉజ్జీవింపజేసేవాడు కాబట్టి కంచి వరదరాజస్వామిని **"పిఱవామల్ వాళ్‌విక్కుమ్ పేరరుళాళర్"** అని అన్నారు. **"పఱై"** అంటే డప్పువంటి వాద్యం. డప్పువేయడమంటే ప్రచారంచేయడమేకదా!

ఈ రీతిలో ఆఱు వార్తలను కృపజేసి, వింధ్యారణ్యంనుండి వేటగాని వేషంలో పెరున్దేవిత్తాయార్, తాను కలసి తమను కాంచీపురానికి తీసికొని వచ్చి, **"శాలక్కిణఱు"** నుండి శ్రీరామానుజులు తీసికొనివచ్చి సమర్పించిన తిరుమంజన తీర్థాన్ని స్వీకరించి ఆనందించి, వారి తిరువారాధనలోని అర్చామూర్తిరూపంలో

వేంచేసి ఉండి, అరుళాళప్పెరుమాళ్ ఎమ్బెరుమానార్ అనే మహాపండితులను తమకు శిష్యులుగా మార్చి- ఈవిధంగా చేసిన పలు ఉపకారాలను శ్రీరామానుజుల కృతజ్ఞతానుసంధానరూపంగా నిరంతరం అనుసంధించేవారు కాబట్టి వారినిగూర్చి **"పేరరుళాళర్ పెరుమై యెన్ఱు స్తుఱవాద శిన్నై యెతిరాశన్"** అని అన్నారు.

తిరువాయ్‌మొళిప్పిళ్ళై కరుణమూలంగా తమకు కల్గిన యతీంద్ర ప్రావణ్యంచేత ఆ శ్రీరామానుజులను సదా ధ్యానం చేసే మామునులను ఉద్దేశించి **"ఎతిరాశన్ తుయ్య పదజ్గళ్ నెఞ్జిల్ మఱవాద శీలన్"** అని సాయించారు.

"తెన్నత్తియూరర్ కళలిణైక్కీళ్ పూణ్డవన్ పాళన్" అయిన భగవద్రామానుజుల విషయంలో ప్రావణ్యాన్ని అత్యంతంగా కల్గి ఉండి, లోకులను ఉజ్జీవింపజేసే మామునులను **"శెయ్యతామరై త్తాళిణై వాళ్‌వియే"** అని మంగళాశాసనం చేయడం ఉచితం కాగా, ఆ రీతిలో చేయకుండా, వ్యర్థప్రలాపాలను చేసే వంచకులను **"పఞ్ఞమా పాతకరే"** అని ఇందులో నిందించారు. అబద్ధంచెప్పడం, హత్య చేయడం, కల్లు తాగడం, దొంగిలించడం, పరస్త్రీలను కామించడం- అనే ఈ అయిదు మహాపాతకాలు అని అంటారు. పాశురంలోని చివరి ఏకారం నిశ్చయార్థకం.

అవ :- మణవాళమహామునులకు అనుకూలురు కానివారిని నిందించిన తరువాత, అనుకూలురైనవారికి మణవాలమామునులు మోక్షోపాయభూతులై ఉండే స్వభావాన్నిగూర్చి తెలుపుతున్నారు.

4. పాతక ముళ్ళై తామే యొళిత్తు ప్పరిన్దవర్‌క్కు
శ్శాతక మానదుమ్ ఈదెన్ఱు కొణ్డు చరణ్ కొడుక్కుమ్
మాతకవోన్ మణవాళమాముని ప్పరన్ మామలర్‌త్తాళ్
పాదుకైయై చ్చరణాయ్ ముడిమేఱ్కొణ్డు పఱ్ఱినర్‌క్కే

మా తకవోన్ = గొప్ప కరుణను కల, మణవాళమాముని పరన్ = మణవాళ మహామునులు అనే మహాపురుషులు, మా మలర్ తాళ్ పాదుకైయై = ఎఱ్ఱని తామరపూలవంటి తమ శ్రీపాదాలలో సమర్పింపబడ్డ శ్రీపాదాలను, శరణ్ ఆయ్ = మోక్షోపాయంగా భావించి, ముడిమేల్ కొణ్డు = శిరస్సుపై దాల్చి (శిరసా వహించి), పఱ్ఱినర్‌క్కు = వానిని ఆశ్రయించినవారికి, పాతకమ్ = మోక్షానికి అవరోధాలై, ఉళ్ళవై = ఉన్న కర్మలను అన్నిటినీ, తామే పరిన్దు = (వారు కోరకపోయినా) తామే కోరి, ఒళిత్తు = పోగొట్టి, శాతకమానదు = (సాధకం) మోక్షోపాయం అనేది, ఈదు ఎన్ఱు = ఈ మా పాదాలే అని, కొణ్డు = నిశ్చయించి, చరణ్ = తమ చరణాలను, అవర్‌క్కు = వారికి, కొడుక్కుమ్ = (మోక్షోపాయంగా) అనుగ్రహిస్తారు.

"మా తకవు" - అంటే గొప్ప కరుణ. ఇక్కడ కరుణకు గొప్పతనం ఏమంటే ఏవిధమైన ప్రత్యపకారాన్ని ఆశించని స్వభావం. తమ పాదుకలను శిరసా వహింపజేసి, తద్ద్వారా వారికి గల మోక్షేచ్ఛను వ్యక్తం చేయడం తప్ప వేఱు దేన్ని భావించకుండా ఉండడం. **"చరణ్ కొడుక్కుమ్"** అనే ప్రయోగానికి తమ శ్రీచరణాలను ఉపాయంగా అనుగ్రహించి, తన్మూలంగా వారికి మోక్షసిద్ధిని కల్గిస్తారు- అని భావం. ఇందువల్ల మామునులు శరణ్యులని తెల్పినట్లయినది. **"తకవు"** అంటే అవరోధాలను పోగొట్టి, ఫలాన్ని ఇచ్చే శక్తిని, గొప్ప కరుణను కల్గి ఉండడం.

అవ :- పాపాన్ని పోగొట్టి, పరమపదాన్ని పొందించే మామునుల పావనత్వాన్ని తెలిపిన తరువాత, భోగత్వాన్ని (అనుభవించదగిన సౌందర్యాన్ని కల్గి ఉండడాన్ని) గూర్చి ఇందులో ప్రస్తావిస్తున్నారు. లేక, మనకు మోక్షం అనుగ్రహించ కుండా పడరాని పాట్లు పెట్టినా, విడువడానికి వీలులేనట్లు కన్నులకు, మనస్సునకు మాధుర్యాన్ని కల్గించే తిరుమేని అందాన్ని మామునులు కల్గి ఉండడాన్ని ప్రస్తుతిస్తున్నారు- అని కూడా చెప్పవచ్చు.

5. నఱ్కేశవన్తమర్ నఱ్ఱవత్తోర్ నయనఙ్గళుక్కు
పొఱ్కోలమేనియన్ పూతలత్తోర్ శెయ్ద పుణ్ణియమామ్
ముక్కోల్ తరిత్త మణవాళమాముని మూర్త్తితనై
ఎక్కోడికాలముమ్ శిన్తై శెయ్వార్తమక్కు ఈడిలైయే

నల్ కేశవన్ తమర్ = దాసులకు హితాన్నే చేసే కేశవునకు దాసులై, నల్ తవత్తోర్ నయనఙ్గళుక్కు =గొప్ప తపస్సు అయిన ఆచార్యాభిమానాన్ని కల్గినవారి కన్నులకు (విందుగా), పొన్ కోల మేనియన్ = మిక్కిలి అందమైన తిరుమేనిని కలవారు, పూ తలత్తోర్ = ఈ భూమిలో జన్మించినవారు అందఱు, శెయ్ద = చేసిన, పుణ్ణియమ్ ఆమ్ = పుణ్యంగా అవతరించినవారు, ముక్కోల్ తరిత్త = త్రిదండాన్ని ధరించినవారు అయిన, మణవాళ మా ముని= మణవాళమహామునుల, మూర్త్తితనై = తిరుమేనిని, ఎక్కోడి కాలముమ్ = ఎన్ని కోట్ల యుగాల కాలం అయినా, శిన్తై శెయ్వార్క్కు = ధ్యానించి, ఆనందించేవారికి, ఈడు ఇలై = సాటివచ్చే వారెవరు లేదు. ఇది తథ్యం.

"పొన్నుమ్", **"కోలమ్"** అనే ఈ రెండు పదాలకు అందమనే అర్థం. ఒకే అర్థాన్ని చెప్పే ఈ రెండు పదాలను కలిపి **"పొఱ్కోలమ్"** అని ప్రయోగించడంవల్ల "మిక్కిలి అందమైన'' అనే అర్థం వ్యక్తం అవుతుంది. లేక, ఒక పదంద్వారా

సముదాయశోభ అనే లావణ్యం, వేఱొక పదంద్వారా ప్రత్యంగశోభ అనే సౌందర్యం- అనే రెండూ చెప్పబడ్డాయని అనవచ్చు. **"తవమ్"**- ఆచార్యాభిమానం అనే తపస్సు. **"కోళరియై వేఱాక ఏత్తి యిరుప్పారై వెల్లుమే మఱ్ఱవరై చ్చార్త్తియిరుప్పార్ తవమ్"** (నరసింహమూర్తిని విలక్షణుడని స్తుతించేవారి తపస్సును, ఆ భక్తులను సేవించేవారి తపస్సు జయిస్తుంది) (నాన్ముకన్-18) అనే తిరుమఱ్ఱిశైప్పిరాన్ శ్రీసూక్తిలో **"తవమ్"** అనే పదం ఆచార్యాభిమానం అనే అర్థంలో ప్రయోగింపబడడాన్ని గమనించవచ్చు. నిజమైన అందం అందంగా తోచాలని అంటే దానికి పుణ్యం చేసి ఉండాలికదా! అదే ఇచట ఆచార్యాభిమానరూపమైన తపస్సుగా చెప్పబడింది.

"ఎప్పొళుదుమ్ నాళ్ తిఙ్గళ్ ఆణ్డాళ్ యూళితొఱుమ్ అప్పొళుదైక్కప్పొళుదు ఎన్నారావముదమే" (ఏ సమయంలోనైనా దినాలు, వారాలు, సంవత్సరాలు, యుగాలు, యుగాలతరబడి అనుభవించినా ఎప్పటికప్పుడు తృప్తిని కలిగించని విలక్షణమైన అమృతంవలే తోచేవాడు) అనే రీతిలో భగవానుని దివ్యమంగళ విగ్రహం భక్తులకు అపర్యాప్తామృతంగా (ఇక చాలు అని తృప్తిని కల్గించని అమృతంగా) భాసించేటట్లే, ఆచార్యభక్తిని కలవారికి మామునుల తిరుమేని ఆరావముదంగా తోస్తుంది. **"ఈడిలై"** అనే ప్రయోగంద్వారా సదా భగవానుని అనుభవించే నమ్మాళ్వార్లు మొదలైనవారు, మామునుల దివ్యతిరుమేనిని సదా చింతన చేసే తమకు సాటిరారు అనే భావం స్ఫురిస్తుంది. దీనినిబట్టి భగవానుని తిరుమేనికంటే మామునుల తిరుమేని గొప్పది - అని వ్యక్తం అవుతున్నది. **"ఞాల ముణ్ణ ఞానమూర్త్తి"** అయిన నారాయణుని తిరుమేని కేవలం **"కోలమేని"**. మామునుల తిరుమేని **"పొఱ్కోలమేని"** కదా!

శ్రీవేదాంతదేశికులు యతిరాజసప్తతిలో భగవద్రామానుజులను **"త్రిజగత్పుణ్యఫలం త్రిదండహస్తమ్"** (త్రిదండాన్ని చేతిలో కలిగిన ముల్లోకాల పుణ్యం) అని కీర్తించారు. వీరు యతివరపు నరవతారభూతులైన మామునులను **"పూతలత్తోర్ శెయ్ద పుణ్ణియమామ్ ముక్కోల్ తరిత్త మణవాళమాముని"** అని అన్నారు. **"పూతలత్తోర్ శెయ్ద పుణ్ణియమాయ్ ముక్కోల్ తరిత్త"** అనే ఇంకొక పాఠం కనబడుతున్నది. తదనుసారం మామునులు త్రిదండాన్ని ధరించడం - భూలోకవాసులు చేసిన పుణ్యంయొక్క ఫలం - అనే భావం స్ఫురిస్తుంది.

అట్లే, **"కోటి" (కోడి)** అనే పదానికి **"మూలై"**- ఒక చిన్న భాగం అనే అర్థాన్ని గ్రహించి, **"అక్కోటికాలముమ్"** అన్నపుడు **"కాలై, మాలై, పకల్, ఇరవు"** అనే ఏ

చిన్నపొద్దులో (కాలంలో) అయినా మణవాళమహామునుల మూర్తిని ధ్యానించేవారికి సాటి ఎవరూ లేరు- అనే అర్థం చెప్పవచ్చు. ఇది కొంత క్లిష్టకల్పనగా తోచినా, "భగవానుని సదా ధ్యానించే ఆళ్వార్లుకూడా మణవాళమామునులను క్షణకాలం అయినా ధ్యానించేవారికి సమానులు కారు" అనే అర్థవిశేషం స్ఫురిస్తున్నందున క్లిష్టత సహ్యమే. **"ఫలముఖగౌరవం న దోషాయ"**అనే శాస్త్రవచనం ఇక్కడ అనుసంధేయం. **"ఎక్కోటికాలముమ్ శిన్ఱై శెయ్వార్తమర్క్కిడైయే"** అనే పాఠం ఉండి ఉంటే యుక్తంగా ఉంటుంది. భావించే మామునుల దాసులకు ఎవరు సాటి లేరు - అని దాని భావం.

అవ :- ముందు శ్లోకంలో అణ్ణన్ మామునుల మూర్తి యొక్క ధ్యానాన్ని గూర్చి ప్రస్తావించారు. ఇందులో వారు చేసే ఉపకారాలను, వాటికి తాము జితులైన వైనాన్ని, తాము వారిని మంగళాశాసనాన్ని చేసే రీతినిగూర్చి పల్కుతున్నారు.

6. ఇల్లై యెన్ఱే యెణ్ణి యెన్పవక్కాట్టై యెరియిలిట్టు
నల్లరుణ్మారి పెయ్దెన్ఱై త్తళిర్ప్పిత్తు నన్గు తన్బాల్
తొల్లరుణ్ ఞానమ్ విళై త్తాళ్న్ద పోకత్తై త్తుయ్ప్పిక్కవే
వల్లవన్ కోయిల్ మణవాళయోకియై వాళ్త్తువనే

ఎన్ పవ క్కాట్టై = నా జన్మ అనే అడవిని, ఇల్లై ఎన్ఱే ఎణ్ణి = ఇక మాకు పాపం అనేది లేదు అని భావించేటట్లు, ఎరియిల్ ఇట్టు = తమ కోపాగ్నికి ఎర చేసి, దహించి వేసి, ఎన్ఱై = దుష్కర్మ అనే నిప్పులో బాధపడే నాపై, నల్ అరుళ్= నిర్హేతుక కృపాకటాక్షం అనే, మారి పెయ్దు = చల్లని వానను కురిపించి, తళిర్ప్పిత్తు = (బాధను తీర్చి) ఉపశమింపజేసి, తన్పాల్ = తమ పట్ల, తొల్ అరుళ్ = పూర్వం ఆచార్యులచేత అనుగ్రహింపబడ్డ, ఞానమ్ విళై = తత్త్వ-హిత-పురుషార్థజ్ఞానాన్ని, నన్గు తళిర్ప్పిత్తు = చక్కగా ఉపదేశాదులతో కల్గించి, ఆళ్న్ద పోకత్తై = మిక్కిలి గాఢమైన పరమపదసుఖాన్ని, తుయ్ప్పిక్కవే = దాసుడు అనుభవించేటట్లు చేయడానికే, వల్లవన్ = సమర్థులైన, కోయిల్ మణవాళ యోకియై = శ్రీరంగాన్ని నిరూపకంగాకల మణవాళ మామునులను, వాళ్త్తువన్= స్తుతిస్తాను.

"పవమ్" - అనే పదం సంసారం (జన్మమరణాల పరంపరారూపం), దానికి కారణంగాను, కార్యంగాను అనువర్తిస్తున్న పాపాలను ఈ పదం తెలుపుతుంది. తత్త్వజ్ఞానాన్ని, మోక్షాన్ని ఆటంకపఱచగలిగే పాపాలు పేరుకొనిపోయి ఉండడంవల్ల, వృక్షాల సమూహాన్ని వనం అన్నట్లే, ఈ పాపాలను అడవిగా రూపించారు. **"ఇఱవు**

శెయ్యుమ్ పావక్కాడు" అని అన్నారు కదా పెరియాళ్వార్లు. **"ఎణ్ణి"** -లెక్కించేటట్లు అని అర్థం. ఇది **"ఎచ్చత్తిరిపు"** - కృదంతవ్యత్యయరూపం. **"ఆళ్న్ద పోకమ్"** అవిచ్ఛిన్నంగా, ఉన్నతంగా ఉండే భోగం. **"న చ పునరావర్తతే"** అనే రీతిలో పునరాగమనం లేని పరమపదానుభవం - అని తాత్పర్యం. పాపారణ్యం దహింప బడడం, నిర్హేతుకకృపావర్షం కురవడం, తత్త్వజ్ఞానం అంకురించడం గంభీరమైన భోగాన్ని అనుభవింపజేయడం -అనేవి అణ్ణన్‌కు మామునులు చేసిన ఉపకారాలు. వాటికి జితులై అణ్ణన్ ఇందులో మంగళాశాసనం చేశారు. **"తుయ్ప్పిక్కవే"** అనే ప్రయోగంలోని ఏకారం అన్యయోగవ్యవచ్ఛేదకం. మామునులసంబంధం ఏనాడూ బంధహేతువు కాదు, మోక్షానికి హేతువు అవుతుంది - అని దీని భావం. **"వాళ్త్తువనే"** అనే పదంలోని ఏకారం వాక్యాలంకారం.

అవ :- అయిదవ పాశురంలో మానసికమైన ధ్యానాన్ని, ఆఱవ పాశురంలో వాచికమైన స్తోత్రాన్ని తెలిపి, ఇందులో కాయిక ప్రణామాన్నిగూర్చి పలుకుతున్నారు. **"యద్ధి మనసా ధ్యాయతి తద్వాచా వదతి తత్కర్మణా కరోతి"** (దేనిని మనస్సుతో ధ్యానిస్తున్నాడో దానిని మాటతో పల్కుతున్నాడు, దానిని చేతలతో చేస్తున్నాడు) అనే రీతిలో ఆర్జవాన్వికల మహాత్ములు భావించేది, స్తుతించేది, నమస్కరించేది ఒక్కరినేకదా!

7. వాళ్త్తువ నెన్ఱై మణవాళమాముని మామలర్త్తాళ్
తాళ్త్తువన్ యానవన్ తాళిణైక్కీళ్ చ్చిరమ్ తారణియిల్
కాళ్త్తిడుమ్ శెల్వముదల్ ముక్కుఱుమ్బుమ్ కరిశఱవే
పాళ్త్తిడు మెన్తనతికోర పావఙ్గళ్ పఱ్ఱఱవే

కాళ్త్తిడుమ్ = బాగా ముదిరి, చేవను కల్గి ఉండే, శెల్వమ్ ముదల్= సంపద మొదలైనవానివల్ల కలిగే, ముక్కుఱుమ్బు = మూడు మదాలు అనే, కరిశు= దోషాలను అన్నిటినీ, అఱ = తొలగించడంకోసం, పాళ్త్తిడుమ్ = దాసుడనైన నన్ను పాడుచేస్తున్న, ఎన్తన్ = నా, అతి కోర పావఙ్గళ్= మిక్కిలి భయంకరం అయిన దుష్కర్మలను, పఱ్ఱు అఱ = నిరాలంబనంగా నశింపజేయడంకోసం, యాన్ = నేను, ఎన్ఱై = దాసుని (జ్ఞానపిత) ఆచార్యులైన, మణవాళమామునిమా మలర్ తాళ్= మణవాళమహామునులగొప్ప, తామరపూలవంటి శ్రీచరణాలను, వాళ్త్తువన్= స్తుతించేవాడనై, అవన్ తాళిణై క్కీళ్ =ఆస్వామి శ్రీపాదాలజంట కిందగల, తారణియిల్ =భూమిపై, శిరమ్ తాళ్త్తువన్ =తలను తాకించి, మొక్కుతాను.

"ముక్కుఱుమ్బు" -మూడు మదాలు. అవి ఏవి? అని అంటే, విద్య, ధనం, అభిజాత్యం -అనే మూడింటివల్ల కలిగే మదాలు. **"విద్యామదో ధనమద స్తృతీయోఽభిజనమదః"** అని సూక్తి. ఈ మూడు విధాలైన మదాలు ఆచార్యాను గ్రహంవల్ల తప్ప స్వప్రయత్నంలో తొలగని రీతిలో మిక్కిలి బలపడి, ముదిరి ఉండడంచేత **"కాళ్త్తిడుమ్ ముక్కుఱుమ్బు"** అని అన్నారు. **"వాళ్త్తువన్"** - స్తుతించేవాడనై - అని అర్థం. శత్రర్థకరూపం ఇది. **"తాళ్త్తువన్"** అనే సమాపక క్రియతో అన్వయిస్తుంది.

"తారణియిల్ శిరమ్ తాళ్త్తువన్" -ఇక్కడ **"శిరమ్"** అనే పదం వక్షస్సు, చేతులు, పాదాలు మొదలైన వానికి ఉపలక్షణమై, వీటితో భూమిపై పడి సాష్టాంగ ప్రణామాన్ని చేయడాన్ని సూచిస్తుంది. మూడవ, నాల్గవ పాదాలలో చివరగల ఏకారం వాక్యాలంకారం.

అవ :- కొందరు కోయిలణ్ణన్ దగ్గఱకు వచ్చి - "చాలామంది మామునులు పాపాలను పొగొట్టి, రక్షించడంకోసం వారి పాదుకలను శిరసా వహించాలని అనుకుంటున్నారు. జ్ఞానాన్ని పొంది, దృఢమైన యోగాన్ని సాధించడంకోసం వారిని స్తుతించాలని అనుకుంటున్నారు. విద్యా-ధన- అభిజన మదాలనే మూడు మదాలు తీరడంకోసం, అతిఘోరపాపాలు నిర్మూలం కావడంకోసం వారి శ్రీపాదద్వంద్వం క్రింద శిరస్సు తాకించి, ప్రణామం చేయాలని అనుకుంటున్నారు. కాని, మేము మాత్రం మమ్ములనే గొప్పవారని భావిస్తున్నాము. ఇతరులుకూడా కొందఱు మమ్ములను ఆ విధంగానే పల్కి గౌరవిస్తున్నారు. ఈ విధంగా ప్రసిద్ధమైన గౌరవాన్ని కల్గిన మేము నలుగురు చూచే రీతిలో మామునుల పాదుకలను మా తలపై ధరించడానికి, వారిని స్తుతించడానికి, వారి శ్రీపాదాలలో శిరస్సును పెట్టి, నమస్కరించడానికి సిగ్గుపడుతున్నాము. ఉజ్జీవించాలనే ఆశ అయితే మాకు చాలా ఎక్కువగానే ఉన్నది. మామునుల గొప్పతనం కూడా మామనస్సులో తోచకపోలేదు. ఇటువంటి క్లిష్టదశలో మీరే మాకు ఉజ్జీవించే ఉపాయాన్ని రహస్యంగా ఉపదేశించాలి" అని ప్రార్థించగా, "మీరు నల్గురికి తెలిసే రీతిలో ఏమీ చేయవద్దు. మామునులను మనస్సులో చింతిస్తేనే చాలు. మీ దుష్కర్మలు అన్నీ పోయి, మోక్షం సిద్ధిస్తుంది. ఆ పనిని చేయండి" అని వారికి ఈపాశురంలో అణ్ణన్ ఉపదేశిస్తున్నారు.

8. పావఙ్గళ్ పఱ్ఱఱుమ్ పాశఙ్గళ్ పఱ్ఱఱుమ్ పఱ్ఱిప్ వైక్కుమ్
కోవఙ్గళ్ పఱ్ఱఱుమ్ కుఱ్ఱఙ్గళ్ పఱ్ఱఱుమ్ కోటిశన్మ
త్తాపఙ్గళ్ పఱ్ఱఱుమ్ తణ్ణరఙ్గన్ పుకళ్ శాన్తకుణ
తీవన్ కరుణై మణవాళయోకియై చ్చిన్దిక్కవే

తణ్ అరఙ్గన్ పుకళ్ = చల్లని శ్రీరంగంలో నివాసం ఉన్న **"అళగియ మణవాళన్"**గా పొగడబడేవారై, శాన్తగుణ తీవన్ = శాంతమనే గుణంతో (క్షమ అనే గుణంతో) ప్రకాశించేవారై, కరుణై = కృపాగుణమే మూర్తీభవించినవారైన, మణవాళ యోకియై = మణవాళమామునులను, శిన్దిక్కవే = భావించినమాత్రం లోనే, పాశఙ్గళ్ =విషయాంతరాలలో ఉండే ఆశలు, పఱ్ఱఱు అఱుమ్ = పట్టుపడలి, తొలగిపోతాయి, పఱ్ఱి వైక్కుమ్ = మనలను ఆశ్రయించి, నిలచి ఉండే, కోపఙ్గళ్= కోపాలు, పఱ్ఱఱు అఱుమ్ =పట్టుపడలి, నశిస్తాయి, కుఱ్ఱఙ్గళ్ = మిగిలిన లోభం మొదలైన దోషాలు, పఱ్ఱఱు అఱుమ్ = పట్టువీడి నశిస్తాయి, పావఙ్గళ్ = పూర్వం తెల్పిన ఆశ, కోపం మొదలైన దోషాలచేత సంభవించే పాపాలు, పఱ్ఱఱు అఱుమ్= పట్టు వదలి, రూపుమాసిపోతాయి. కోటి శన్మ త్తాపఙ్గళ్ = ఆ పాపాల పర్యవసానంగా కోటిసంఖ్యలోని జన్మలలో మనం అనుభవించే దుఃఖాలు, పఱ్ఱఱు అఱుమ్ = పట్టుపడలి, నశిస్తాయి.

అన్ని దివ్యదేశాలలోను ముఖ్యం అయిన శ్రీరంగంలో వేంచేసి ఉండే సకలార్చావతారమూలకందం అయిన అళగియమణవాళప్పెరుమాళ్ (శ్రీరంగ నాథుని ఉత్సవమూర్తి) చేత **"శ్రీశైలేశదయాపాత్రమ్"** ఇత్యాది తనియన్ శ్లోకంద్వారా పొగడబడినవారు, క్షమాగుణంచేత ప్రకాశించేవారు, దయాగుణమే రూపుదిద్దు కొన్నట్లున్నవారు- అని ఈ రీతిలోని గొప్పతనాన్ని కల మామునులను ఎవరికీ తెలియకుండా మనస్సులో ధ్యానిస్తే చాలు. ఉన్నత గతిని పొందడానికి మీరు విస్తృతంగా ఏమీ చేయనక్కఱలేదు- అని తెలిపినట్లయింది.

"తాపఙ్గళ్" -**"తున్బఙ్గళ్"** (దుఃఖాలు). ఇవి ఆధ్యాత్మిక- ఆధిభౌతిక- ఆధిదైవికాలని మూడు విధాలు. శరీరంవల్ల కలిగే వ్యాధులు, మనస్సువల్ల కలిగే ఆధులు-ఆధ్యాత్మికాలు. ఆత్మ అంటే శరీరమని, మనస్సు అనీ కూడా అర్థం ఉన్నది. పులులు, సింహాలు, పాములు, చోరులు - మొదలైనవాటివల్ల కలిగే బాధలు ఆధిభౌతికాలు. భూతం అంటే ప్రాణి. సూర్యుడు, అగ్ని, వాయువు- ఇత్యాదులవల్ల కలిగే బాధలు ఆధిదైవికాలు. దైవం అంటే దేవత.

"శిన్దిక్కవే"- ఇచటి ఏకారం అన్యయోగవ్యవచ్ఛేదకం. ఇది పాదుకలను ధరించడం, స్తుతించడం, నమస్కరించడం మొదలైనవానిని వ్యవచ్ఛేదిస్తుంది. భగవద్విషయంలో సైతం **"శిఱ్ఱవేణ్డా శిన్దిప్పే అమైయుమ్"** (భయపడవద్దు,

చింతనయే చాలు) అని చెప్పబడు తుండగా, ఆచార్యవిషయంలో అది కైముతికన్యాయసిద్ధంకదా! సర్వేశ్వరుడు కారుణికుడు అయితే ఆచార్యుడు పరమకారుణికుడు కదా!

అవ :- "యథార్థాన్ని గమనిస్తే, మామునులు తమ మహిమను భావించే వారినే కాదు, అసూయను పొంది, తమను నిందించేవారినికూడా విడువకుండా మామునులు ఉజ్జీవింపజేస్తారు. ఈ నిజాన్ని నీవు ఓ మనసా! తెలిసికో" అని అంటూ తమ మనస్సుకు అణ్ణన్ రహస్యంగా ఇందులో ఉపదేశిస్తున్నారు.

9. శిన్దిత్తరఙ్గరై చ్చిన్దై ప్పయఱ్కెడ చ్చెన్నితన్నాల్
వన్దిత్తు నిచ్చలుమ్ వాయార వాళ్త్తుత మెయ్మ్మా మతైయోర్
పున్దిక్కుళ్ మేవుమ్ వరయోకి తమ్మై ప్పుకైన్ద శిలర్
నిన్దిక్కినుమే వీడారిదుకాణవర్ నీర్మై నెఞ్జే

నెఞ్జమే = నాకు అనుకూలమైన, భవ్యమైన మనసా!, శిన్దై = తమ మనస్సు, పయమ్ కెడ = ఐహికంగా, ఆముష్మికంగా ఏర్పడే భయం తీరి, నిర్భయంగా ఉండడంకోసం, నిచ్చలుమ్ =నిత్యం, అరఙ్గరై = శ్రీరంగనాథుణ్ణి, శిన్దిత్తు = ధ్యానించి, శెన్నితన్నాల్ = శిరస్సుతో, వన్దిత్తు = నమస్కరించి, వాయ్ ఆర = నోరార, వాళ్త్తుమ్= మంగళాశాసనాన్ని చేసే, మెయ్ మా మతైయోర్ = నిజమైన, గొప్ప బ్రాహ్మణుల, పున్దిక్కుళ్ = మనస్సులో, మేవుమ్ = (ధ్యానింపబడి) పొందికగా ఉన్న, వరయోకి తమ్మై = మామునులు తమను, శిలర్ = వారి మహిమను తెలియని కొందఱు, పుకైన్ద = ఓర్వలేక, అసూయపడి, నిన్దిక్కిలుమ్ = నిందించినప్పటికీ, విడార్ =వారినికూడా విడువకుండా, తరింపజేస్తారు, అవర్ నీర్మై = ఆ మణవాళమామునుల గొప్పతనం, ఇదు కాణ్ = ఇటువంటిది అని గ్రహించు.

ఓ మనసా ! మణవాళమామునులు శ్రీరంగనాథునిచేత కీర్తింపబడిన వారు. క్షమను, కృపను నిండుగా కలవారు. కొందఱు వీరి ఈ మహిమలను చూచి సహించలేక నిందించినా ఆ నిందలను సహించి, వారి దుర్గతిని చూచి సహించలేని స్వభావం అనే కరుణతో వారినికూడా తమ దాసులతో సమానంగా రక్షిస్తారు మామునులు- అని ఉపదేశించినట్లయింది. ఇందువల్ల **"నాన్ పెఱ్ఱ పేఱు నాలూరానుమ్ పెఱవేణుమ్"** (నేను పొందిన ఫలం నాలూరాన్ కూడా పొందాలి) అని వరదరాజస్వామిని ప్రార్థించిన కూరేశులు వంటివారు శ్రీమణవాళమామునులు అని అన్నట్లయింది. భగవానుడు **"రిపూణా మపి వత్సలఃr"** (శత్రువుల విషయంలో

కూడా వాత్సల్యాన్ని కలవాడు). పిరాట్టి **"రిపూణా మపి వత్సలతర"**. కూరేశులు, మామునులు **"రిపూణామపి వత్సల"**తములు. మహాచార్యులలోకూడా కూరేశులతో, మామును లతో సాటి వచ్చేవారెవరూ లేరు. **"నిన్దిక్కినుమే", "నెఞ్జే"** అనే ప్రయోగాలలోని ఏకారం వాక్యాలంకారం.

అవ :- ఎనిమిదవ పాశురంలో పల్కినట్లు మామునులను స్తుతించడమో, ప్రణమిల్లడమో చేయనక్కఱలేదు, భావిస్తేనే చాలు, వారికి ఉజ్జీవనం లభించడం తథ్యం- అనే సూక్తిని వినిన కొందఱు, తొమ్మిదవ పాశురంలో తెలిపిన తమను నిందించేవారినిసైతం మామునులు విడువకుండా తరింపజేస్తారు - అనే వారి సౌలభ్యాన్ని వినిన తమ మనస్సు "ఇటువంటి మామునుల సేవను అందఱూ కీర్తిస్తున్నారా? వారిని అందఱు ప్రేమిస్తున్నారా? ఆ రీతిలో కనపడడంలేదే ! దీనికి ఏం కారణం? అని ప్రశ్నించగా, "మన సంప్రదాయానికే చెందిన కొందఱు తమ పాపఫలంగా వారిని నిందిస్తున్నారు. మిగిలిన సంప్రదాయాలకు చెందిన మఱి కొందఱు అయితే - అనాదిపాపవాసనాఫలంగా బుద్ధి చెడి, భగవానుడనేవాడు లేడు; ఉన్నా అతనికి రూపం లేదు, గుణాలు లేవు, విభూతి లేదు- అని వాదించి, చివరకు మామునులవద్ద ఓడిపోయి, వారిని నిందిస్తున్నారు. వారిని ఆ రీతిలోనే ఉండనీయండి. పెక్కుమంది శ్రీరంగనాథునకు ఆచార్యులై, ఆ స్వామిని భావించి, నమస్కరించి స్తుతించే వైదికులైన మహనీయులచేత సదా ధ్యానింపబడే ఆ మామునులు అనుగ్రహించే సేవను "ఇది పావనం, పరమభోగ్యం" అని కీర్తించి, వారిని అభిమానిస్తున్నారు" అని అంటూ తమను ప్రశ్నించినవారికి, తమ మనస్సుకు అణ్ణన్ సమాధానం పలుకుతున్నారు.

10. నెఞ్జే యనైయ వడియార్ నిఱమ్ కొణ్డ నిచ్చయమామ్
మఞ్జేఱు శోలై యరఙ్గప్పదితనిల్ వాదియర్క్కు
నఞ్జే యనైయ మణవాళయోకి యిన్నాళళిక్కుమ్
తఞ్జైవైతన్నై యికళ్వార్క్కల్లాల్ అవర్ తామిట్టరే

మఞ్ఞ ఏఱు శోలై = మేఘాలు అధిరోహించి, చేరిఉండే తోటలచేత చుట్టబడిన, అరఙ్గమ్ పదితనిల్ = శ్రీరంగం అనే నగరంలో, వాదియర్క్కు = వ్యర్థవాదాలను చేసేవారికి, నఞ్జే యనైయ = విషంవంటివారైన, మణవాళ యోకి= మణవాళమామునులు, ఇన్నాళ్ = (మనం జీవించే భాగ్యాన్ని పొందిన) ఈ కాలంలో, అళిక్కుమ్ = సర్వస్వదానంగా అనుగ్రహించే, తమ్సేవై తన్నై= పావనం, భోగ్యం అయిన తమ దర్శనాన్ని, ఇకళ్వార్క్కు అల్లార్ = నిందించే కొందఱు

భాగ్యహీనులకు తప్ప మిగిలిన అందఱికీ, అవర్తామ్ = ఆ మామునులు, ఇట్టరే = ఇష్టులే. (ఇది), నెఞ్జే అనైయ = మామునుల మనస్సువలె వారికి అంతరంగులైన, అడియార్ = దాసులు, నిఱుమ్ కొణ్డ = తమ మనస్సులో విడువకుండా గ్రహించిన, నిచ్చయమ్ ఆమ్ = యథార్థం.

ఈ పాశురంద్వారా **"కరువిలే తిరువిలాద"** అన్నట్లు గర్భదరిద్రులకు తప్ప భాగ్యవంతులందఱినీ మామునుల ఇష్టులు - అని దాసుని నిశ్చయమే కాదు, అసంఖ్యాకులైన వారి దాసుల నిశ్చయం కూడా ఇదే అని తెలిపి, తమ మనస్సుకు, తమను ప్రశ్నించిన కొందఱికి స్పష్టంచేశారు.

"తఞ్జైవైతన్నై యిగళ్వార్క్కల్లార్ అవర్తా మిట్టరే" అన్నది పాఠాంతరం. దానిప్రకారం. నిందించేవారు విద్యాజ్ఞానగంధం లేనివారు. వారు భగవద్భాగవతాచార్యులకు ఇష్టులా! ఇష్టులుకారు - అని భావం. (ఇచటి ఏకారం కాకువు, వ్యతిరేకార్థకమైన ప్రశ్నారూపం) ముందుపాఠంలో **"ఇట్టరే"** అనే పదంలోని ఏకారం నిశ్చయార్థకం. ఇష్టులు అనేది సత్యం - అన్నది దాని తాత్పర్యం. **"నెఞ్జే, నఞ్జే"** అనే పదాలలోని ఏకారం వాక్యాలంకారం.

అవ:- ఈ భూలోకంలోని వారందఱూ కీర్తించినపుడేకదా ఎవరి గొప్పతనం అయినా పరిపూర్ణం అవుతుంది, ప్రకాశిస్తుంది. కొంతమంది నిందించినందువల్ల మామునుల గొప్పతనానికి లోటు రాదా? అని అంటే, మహామునుల అవతారం భగవదవతారంవలె దుష్టనిగ్రహ - శిష్టపరిపాలనార్థం కనుక, యథార్థాన్ని గ్రహించలేని మూర్ఖులు నిందిస్తే దానికి ఏ కొఱత రాదని అణ్ణన్ ఇందులో తెలుపుతున్నారు.

11. ఇట్టర్కళ్ వాழ్ ఎతిరాశర్ వాழ్ ఇరునిలత్తే
శిట్టర్కళ్ వాழ్ నన్దేశికర్ వాழ్ చ్చెకత్తినుళ్ళ
తుట్టర్కళ్ మాళ మణవాళమాముని తోన్టిననే
ఎట్టు మిరణ్డు మఱియార్ ఇజ్గేశినుమ్ యా వరుమే

మణవాళమాముని= మణవాళమహామునులు, ఇరు నిలత్తే = విశాలమైన భూమిలోఉండే, ఇట్టర్కళ్ వాழ్ = భగవద్భక్తులు తరించేటట్లు, ఎతిరాశర్ వాழ్= భగవద్రామానుజుల ఉజ్జీవించేటట్లు, శిట్టర్కళ్ వాழ్ = సదాచారసంపన్నులు తరించేటట్లు,శెకత్తిల్ ఉళ్ళ = భూమిలో ఉండే, తుట్టర్కళ్ మాళ = దుష్టులు నశించేటట్లు, తోన్టినన్ ఏ = అవతరించారు అన్నది నిశ్చయం, ఎట్టుమ్ ఇరణ్డుమ్ అఱియార్ = ఎనిమిది, రెండు కలిపితే పది అవుతుందని తెలియనివారు, ఇజ్గు= ఈలోకంలో, ఏశినుమ్ = నిందిస్తే, యా వరుమ్=ఏ కొఱత కల్గుతుంది? (ఏదీ కలుగదు)

ఈ విశాలభూమిలో- భగవద్భక్తులు, వారు కీర్తించే భగవద్రామానుజులు, వారి సిద్ధాంతాన్ని నమ్మి ఆచరించే పరమవైదికులైన శిష్టులు, వారిలో కొందఱైన మనకు సదుపదేశం చేసే పూర్వాచార్యులు- అనే సాధువులు అందఱు "సన్మార్గాన్ని ఉద్ధరించే మామునులు అవతరించారు. ఇక ఏ కొఱత లేదు" అని ఆనందించడం కోసం, పాపులైన బాహ్య-కుదృష్టి మతస్థులు "మన సిద్ధాంతం నశించింది" అని భయపడి రూపు మాసిపోవడంకోసం మణవాళమహామునులు అవతరించారు- అని తాత్పర్యం. ఇందువల్ల **"పరిత్రాణాయ సాధూనామ్"** (సత్పురుషులను రక్షించడంకోసం) అనే రీతిలో భగవానుని అవతారంవంటిదే మణవాళ మహామునుల అవతారంకూడా -అని తెలిపినట్లయింది. భగవానుడు **"అవజానంతి మాం మూఢాः"** (నా గొప్పతనాన్ని తెలియని మూఢులు నన్ను అనాదరిస్తున్నారు) అని గీతలో అన్నాడు. ఈ విధంగా అవమానించినందువల్ల ఆ భగవానునకు ఏ కొఱత కల్గింది?; నిందించినవారు నశించారే తప్ప. ఆ రీతిలోనే మణవాళ మహామునులను కొందఱు మూఢులు నిందిస్తే దానివల్ల వారు నశించడం తప్ప, మామునులకు ఏ కొఱత రాదు- అని ఇచటి సారం.

"ఎట్టు మిరణ్డు మఱియార్" అనే ప్రయోగానికి -తిరుమంత్రమనబడే అష్టాక్షరిని, ద్వయమంత్రం అనే వాక్యద్వయాన్ని, లేక, ద్వయం, చరమశ్లోకం అనే రెండింటిని - అనే అర్థాన్నికూడా గ్రహించవచ్చు. సామాన్యంగా ఈ రహస్యాలను అర్థంతోపాటు తెలిసినవారు వీటిని ఉపదేశించే ఆచార్యులను కీర్తిస్తారే తప్ప నిందించరు. విశేషించి, తిరుమంత్రం మధ్యలో ఉన్న నమఃపదంలో అర్థంగా తోచే భాగవతశేషత్వాన్ని తెలిసినవారికి భాగవతోత్తములైన ఆచార్యులను స్తుతించి, గౌరవించే అవకాశం ఉన్నది తప్ప, నిందించే ప్రసక్తి లేనే లేదు. వీటిని గ్రహించినవారే సత్తను పొందినవారు. తెలియనివారు మృతప్రాయులే. అందువల్ల, తెలియనివారు నిందిస్తే ఏ కొఱతలేదు- అనే అర్థంకూడా గ్రాహ్యమే. **"కఱ్ఱోర్కళ్ తా ముకప్పర్..... మఱ్ఱోర్కళ్ మాచ్చరియత్తాల్ ఇకழ్వుర్ వన్దెన్?"** (విజ్ఞులైనవారు సంతోషిస్తారు.... మిగిలినవారు మాత్సర్యంతో నిందిస్తేమాత్రం ఏమి?) అని అనుగ్రహించిన మామునుల శిష్యాగ్రగణ్యులు కాబట్టి వీరుకూడా (అణ్ణన్) **"ఏశిన్ యా వరుమ్"** అని అన్నారు. **"ఏశినుమ్"** ఇచట **"ఉమ్"** వాక్యాలంకారం. **"యా వరుమే"** అన్నపుడు **"యా"** అనే పదం అమహద్వాచక ప్రథమపురుష బహువచనంలోని ప్రశ్నార్థకరూపం. "ఏ-దోషాలు" - అని అర్థం. **"యా వరుమే"** అనే పదంలోని ఏకారం **"ఇశైనిత్రై"**, **"ఈఱ్ఱన్ఱై"** కాదు.

అవ :- ముందు పాశురంలో అవతారవిషయంలో అణ్ణన్ భగవానునకు-భగవద్రామానుజులకుమధ్య సామ్యాన్నిగూర్చి అనుగ్రహించారు. ఇందులో ద్రావిడవేదాంతప్రవర్తకత్వం అనే భగవానునకు లేని, మామునులకుండే అతిశయాన్ని గూర్చి అనుగ్రహిస్తున్నారు.

12. యావరు ముయ్య మణవాళయోకి దయాళు వెన్న
పూమకళ్ మణ్‌మకళ్ పుణ్ణియమా యిన్ద ప్పూతలత్తే
తా మవతారమ్ శెయాదిరున్దాల్ శడకోపర్ తిరు
వాయ్‌మొళ్ళియోడు కడలోశైయోడెన్న వాశి యుణ్డే !

మణవాళ యోకి = మణవాళమహాములు, యావరుమ్ = నిందించే వారు, అన్యులు అనే అందఱు, ఉయ్య = ఉజ్జీవించడానికి అనువైన, దయాళు = దయాస్వభావులు, ఎన్న = అని లోకులుపలికేటట్లు, పూ మకళ్ మణ్ మకళ్ పుణ్ణియమాయ్ = లక్ష్మీదేవియొక్క, భూదేవియొక్క పుణ్యఫలంగా, ఇన్ద ప్పూతలత్తు = ఈ భూమిలో, తామ్ = మణవాళమహాములు తాము, అవతారమ్ శెయాదిరున్దాల్ = అవతరించి ఉండకపోతే, శడకోపర్ తిరువాయ్‌మొళ్ళి యోడు = నమ్మాళ్వార్లు అనుగ్రహించిన తిరువాయ్‌మొళ్ళికి, కడలోశైయోడు = సముద్రఘోషకు మధ్య, ఎన్న వాశి ఉణ్డు = ఏమి తారతమ్యం ఉంటుంది?

పూర్వశ్లోకంలో **"ఇట్టర్‌కళ్, ఎతిరాశర్, శిట్టర్‌కళ్, నమ్‌దేశికర్"**అనే పెద్దలందఱు ఉజ్జీవించేటట్లుగా సంభవించింది మణవాళమహాముల అవతారం- అని తెలిపారు. ఇందులో ఆశ్రితులు, అన్యులు అనేవారు అందఱు ఉజ్జీవించేటట్లు మామునుల అవతారం సంభవించింది -అని అంటున్నారు.

అందఱిని ఉజ్జీవింపజేయాలని తలచి, చేతనులను సంస్కరించే శ్రమను స్వీకరించే లక్ష్మీదేవి, "నా పనిని మామునులు చేపడతారు. మనం ఇక సుఖంగా ఉండవచ్చు" అని ఆనందించేటట్లు, పాపులను మోస్తూ బాధపడే భూదేవి "మామునులు గొప్ప కరుణతో పాపులను అందఱినీ పరమపదానికి చేర్చగలరు, నాకిక వారిని మోసే భారం అవసరం లేదు" అని ఆనందించేటట్లు మామునులు అవతరించారు- అనే భావం రెండవ పాదంలో స్ఫురిస్తుంది. ఒకరు ఆనందించడానికి వారు చేసిన పుణ్యమే కారణం కాబట్టి, ఆ పుణ్యం మామునులను అవతరింపజేసి, తన్మూలంగా భూదేవిని, లక్ష్మీదేవిని ఆనందింపజేసిందని తాత్పర్యం. మామునులకు ముందున్న ఆచార్యులు అందఱూ **"పారులకిల్ ఆశైయుడైయోర్ క్కెల్లామ్ ఆరియర్‌కాళ్ కూఱుమ్"** (ఆర్యులారా! భూమిలో ఆశ ఉన్నవారికి

అందరికీ చెప్పండి) అని పల్కి ఎమ్బెరుమానార్లు అవధిని ఛేదించినా, ఆఱు యిరప్పడిమొదలైన వ్యాఖ్యానాలు ఒకటికి అయిదుగా తిరువాయ్‌మొళ్ళికి అవతరించినా, ఒకరు, ఇద్దరు, ముగ్గురు,నల్గురు, అయిదుగురు - అనే ఈ రీతిలో పరిమితసంఖ్యలోని శిష్యులకే తిరువాయ్‌మొళ్ళి అర్థాన్ని ఉపదేశిస్తూ పోయినందున, గొప్ప అర్థం ఉన్న తిరువాయ్‌మొళ్ళి, అర్థం లేని సముద్రఘోషవలె తోచింది. మామునులు అవతరించిన తరువాత అయితే - నమ్బెరుమాళ్‌తో పాటు పలువేల సంఖ్యలోని శిష్యులకు వారు తిరువాయ్‌మొళ్ళిని ఆ అయిదు వ్యాఖ్యానాలతో పాటు కాలక్షేపం కటాక్షించినందున దాని అర్థం అంతటా వ్యాపించి ప్రకాశించింది. అందువల్ల మామునులు అవతరించి ఉండకపోతే శఠకోపుల తిరువాయ్‌మొళ్ళికి సముద్రఘోషకు తేడాఉండి ఉండేదా! అని అనుగ్రహించవలసి వచ్చింది. **"వాశి యుణ్డే"** అనే పదంలోని ఏకారం **"ఈఱ్ఱైశై"**. మణవాళమహా మునులకు గల అష్టదిగ్గజాలనే ఎనిమిదిమంది శిష్యులలో ఒకరైన అప్పిళ్ళార్ సంప్రదాయచంద్రిక అనే ప్రబంధంలో అనుగ్రహించిన - **"శేఱ్ఱు క్కమలవయల్ శూழరఙ్గర్ తఞ్జైర్ తழైప్ప ప్పోఱ్ఱి త్తొழు నల్ల వన్దణర్ వాழ విప్పూతలత్తే, మాఱ్ఱరఱ్ఱ శెమ్బొన్ మణవాళముని వన్దిలనేల్ ఆఱ్ఱిక్కురైన్ద పుళియల్లవో తమిழారణమే"** (పంకంలో పుట్టిన కమలాలతో నిండిన పొలాలు చుట్టూ ఉండే శ్రీరంగంలోని శ్రీరంగనాథుని గొప్పతనం వృద్ధి అయ్యేటట్టు కీర్తించి నమస్కరించే గొప్ప బ్రాహ్మణులు ఉజ్జీవించే టట్లుగా సాటిలేని, అందమైన, బంగారు వలె ఆశపడదగిన శ్రీరంగంలో మణవాళ మామునులు వేంచేసి ఉండకపోతే ద్రావిడవేదంగా చెప్పబడే తిరువాయ్‌మొళ్ళి నీటిలో కరిగిన చింతపండువలె వ్యర్థమయ్యేది కదా!) అనే పాశురం ప్రకృతంలో సంవాదంగా అనుసంధేయం.

అవ :- చివరిగా - ఇంతవరకుగల పన్నెండు పాశురాలలో అనుగ్రహించిన మామునుల మహిమలకు అన్నిటికీ శిఖరాయమాణమై, సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే తనియన్ అనుగ్రహించేటట్లు ఏర్పడిన వారి విలక్షణమైన అతిశయాన్ని ఇందులో కీర్తిస్తూ అణ్ణన్ తనివి తీర తృప్తిచెందుతున్నారు. ద్రావిడవేదాంత ప్రవర్తకాచార్యత్వాన్ని విషయంగాకల మొదటిపాశురంతో ఈ పాశురాన్ని చేర్చడంవల్ల (అన్దాది కాబట్టి) ఇందులో చెప్పబడే భగవత్‌మంత్ర (తనియన్) రూపకైంకర్య ప్రతిసంబంధిత్వం అనే వైభవం ద్రావిడవేదాంత ప్రవర్తకాచార్యత్వమూలంగా ఏర్పడినదని తెలియజేయ బడింది.

13. వాశి యుటిన్ద వదరియిల్ నారణనార్ మనఙ్కొళ్
తేశుడై యెన్నై మణవాళమాముని శీర్ తழైప్ప

చ్ఛీశయిలేశ దయాపాత్తిర మెనుమ్ శీర్ మన్దిరమ్
దేశికనాయ్ క్కణ్డురైత్తార్ ఇవ్వైయకఞ్జీర్ ఉఱవే

వాశి అటిన్ద = ఇతరులకంటె మణవాళమహామునులకు గల వైలక్షణ్యాన్ని తెలిసినవారైన, వదరియిల్ నారణనార్ = బదరికాశ్రమంలో వేంచేసి ఉండే శ్రీమన్నారాయణుడు, మనమ్ కొళ్ తేశుడై ఎన్దై = తమ మనస్సులో మాఱుకుండా గ్రహించిన గొప్పతనాన్ని కలవారైన దాసుని ఆచార్యులైన, మణవాళమాముని శీర్ = మణవాళమామునుల కల్యాణగుణాలు, తళైప్ప = (లోకులచేత చక్కగా గ్రహింపబడి) మిక్కిలి వ్యాప్తి చెందేటట్లు, శీశయిలేశ దయా పాత్తిరమ్ ఎనుమ్ = **"శ్రీశైలేశదయాపాత్రమ్"** అని ప్రారంభమయే, శీర్ మన్దిరమ్ = శబ్దసందర్భంచేత, అర్థగాంభీర్యంచేత అందమైన మంత్రాన్ని, దేశికనాయ్ కణ్డు = మంత్రప్రదుడైన ఆచార్యుడై, పరిశీలించి, రచించి, ఇవ్వైయమ్ శీర్ ఉఱ = ఈలోకంలోని వారు అనుసరించి, గొప్పతనాన్ని చక్కగా పొందడంకోసం, ఉరైత్తార్ = అనుగ్రహించారు. (చెప్పారు)

బదరికాశ్రమంలో వేంచేసి ఉండే శ్రీమన్నారాయణుని అతని శిష్యులు ఇద్దరు ప్రణమిల్లి, దాసులమైన మాకు రక్షకంగా ఉండే దాన్ని దేనినైనా అనుగ్రహించాలని ప్రార్థించారు. అపుడు ఆ స్వామి వారిని కరుణించి- **"శ్రీశైలేశదయాపాత్రం ధీభక్త్యాదిగుణార్ణవమ్"** అనే తనియన్ శ్లోకంలోని ఒక సగాన్ని అనుగ్రహించి, వేరొక సగాన్ని తాము శ్రీరంగంలో అనుగ్రహిస్తానని తెలిపి, వారిని శ్రీరంగానికి పంపించాడు. వారు ఆ రీతిలోనే శ్రీరంగానికి వచ్చినపుడు అది మణవాళ మహామునులు శ్రీరంగనాథునకు ఈడు ముప్పత్తూయిరప్పడిని కాలక్షేపం అనుగ్రహించి, ఆ కాలక్షేపాన్ని పరిసమాప్తిచేసే సమయం. అపుడు బదరీ నారాయణుడు శ్రీరంగనాథుని రూపంలో పూర్వం తాను పల్కిన శ్లోకార్ధంతోపాటు **"యతీంద్రప్రవణం వందే రమ్యజామాతరం మునిమ్"** అనే వేఱొక సగాన్నికూడా కలిపి అనుగ్రహించారు- అనే విషయం సంప్రదాయసిద్ధం. ఈ విషయం మామునులశిష్యులు ఎనిమిదిమందిలో ఒకరైన అప్పిళ్ళార్ అనుగ్రహించిన **"సంప్రదాయచంద్రికై"** అనే ప్రబంధంలోని నాల్గవ, అయిదవ పాశురాలలో స్పష్టంగా కనిపిస్తున్నది.

వదరియాచ్చిరమత్తిల్ ఇరు మెయ్ త్తొణ్డర్
వకైయాక నారణనై అడి వణఙ్గి
క్కతియాక ఓర్ పొరుళై అళిక్క వేణ్డుమ్
కణ్ణనే ! అడియోఙ్గళ్ తేఱ వెన్న

చ్చదిరాక చ్చిశైలమన్దిరత్తిన్
శయమాన పాదియై ఆఙ్గరుళిచ్చెయ్దు
పదియాన కోయిలుక్కు చ్చెన్మిన్ నీవిర్
పాదియైయుమ్ శొల్లుదుమ్ యామ్ తేఱ వెన్నార్

శెట్టవర్కళ్ ఇరువరుమే శేర వన్దు
తిరువరఙ్గన్ దినశరియై కేళా నిఱ్ఱ
చ్చన్నిదిమున్ కరుడాళ్వార్ మణ్డపత్తిల్
తామీడు శాత్తుకిట్ట శమయన్దన్నిల్
పొన్నిదనిల్ నీరాడి పుకళ్న్దు వన్దు
పుకళ్రఙ్గర్ శన్నిదిమున్ వణఙ్గి నిఱ్ఱ
చ్చన్నిదియిల్ నిట్టరఙ్గర్ తామే యన్ద
త్తనియు నురైశెయ్దు తలైక్కట్టినారే

(బదరికాశ్రమంలో ఇద్దఱు భక్తులు యథాక్రమం శ్రీమన్నారాయణుని శ్రీపాదాలకు నమస్కరించి "స్వామీ! దాసులమైన మేము ఉజ్జీవించేటట్లు గతి అయిన ఏదైనా ఒక అర్థాన్ని అనుగ్రహించాలి" అని ప్రార్థించగా అందంగా "శ్రీశైలేశదయాపాత్రమ్" అనే తనియన్‌లోని సగభాగాన్ని బదరికాశ్రమంలో స్వామి అనుగ్రహించి, "నా దివ్యదేశం అయిన శ్రీరంగానికి మీరు వెళ్ళండి. మిగిలిన సగాన్ని నేనక్కడ చెప్పగలను" అని అన్నాడు. ఆ విధంగానే ఆ భక్తుడు శ్రీరంగం వెళ్ళి అక్కడ శ్రీరంగనాథుని పంచాంగ శ్రవణాన్ని చేసే సమయంలో, గరుడాళ్వార్ మండపంలో శ్రీ వరవరమునుల ఈడు కాలక్షేపం పూర్తి అయ్యే సమయంలో, కావేరీ నదిలో స్నానం చేసి, శ్రీరంగ నాథుని సన్నిధి ముందుకు వచ్చి నిలచి, ఆ స్వామిని స్తుతిస్తూ ఉండగా, శ్రీరంగ నాథుడు స్వయంగా బాలుని రూపంలో వచ్చి ఈతనియన్‌లోని మిగిలిన సగభాగం అనుగ్రహించి పూర్తిచేశాడు.)

అనేవి ఆ పాశురాలు. (అయిదవ పాశురంలో **"శాత్తుకిట్ట"** అనేదే సరి అయిన పాఠం. పూర్తిచేస్తున్న అని దాని అర్థం. **"శాత్రుకిట్ట"** అనే పాఠం సరసం కాదు.)

తిరువాయ్‌మొళిప్పిళ్ళై అనుగ్రహానికి పాత్రమై, ఆకారణంగా జ్ఞానభక్తి వైరాగ్యాది గుణాలకు సముద్రంవంటివారు, యతీంద్రప్రావణ్యాన్ని పొందిన వారు అయిన అళగియ మణవాళమామునులకు ప్రణమిల్లి, స్తుతిస్తున్నాను -అనేది శ్రీరంగనాథుడు అనుగ్రహించిన శ్రీశైలేశదయాపాత్రతనియన్ శ్లోక భావం.

భగవానుడు తనకు సర్వేశ్వరత్వంకంటె, ఆచార్యత్వమే గొప్పది అని భావించి, రహస్యత్రయ-గీత-అభయప్రదానాదులను ఉపదేశించి ఆచార్యత్వాన్ని పొందాడు. అయినప్పటికీ, అవి అన్నీ తన గొప్పతనాన్ని తెలిపేవి కాబట్టి, తనను తాను పొగడుకొనేవానికి లోకంలో ఆప్తత్వం (నమ్మదగిన స్వభావం) కల్గడం అరుదు అని భావించి, అంతవరకు పొందిన ఆచార్యత్వంతో తృప్తిని పొందలేకపోయాడు. ఇతరులతోపాటు తానుకూడా పెద్దల అతిశయాన్నిగూర్చి పల్కి, ఆప్తత్వాన్ని పొంది ''ఆప్తుడైన ఆచార్యు డితడు''అని అందఱిచేత చెప్పబడేటట్లు గొప్పదైన ఆచార్యత్వాన్ని సంపాదించాలి- అని చాలాకాలంగా ఆశపడిన ఆ భగవానుడు చివరిగా నిజమైన గొప్పతనాన్ని కల మణవాళమహాములకు ప్రియశిష్యుడై, ఈడు వ్యాఖ్యను విని, వారికి తనియన్‌ను అనుగ్రహించి, మంత్రప్రదత్వం అనే ఆచార్యత్వాన్ని పొంది తృప్తిని చెందాడు.

"మణఱ్కాళ్ తేశు" అనే పాఠంకూడా కన్పిస్తున్నది. **"మణమ్"** అంటే ఆనందం. ఆనందానికి తగిన తేజస్సు -అని అర్థం. లోకం అంతా కీర్తించే మంత్రం కాబట్టి **"శ్రీశైలేశ"** మంత్రాన్ని **"శీర్ మన్దిరమ్"** అని అన్నారు. ఇచటి **"శీర్‌మై"** ఏమంటే - శబ్దమాధుర్యం, అర్థంలోని సత్యత్వం, గాంభీర్యం.

"మన్దిరమ్" (మంత్రమ్)- "మంతారమ్ త్రాయతే ఇతి మంత్రః" అనే వ్యుత్పత్తినిబట్టి తను అనుసంధించేవానిని కాపాడేది మంత్రం. **"దేశికన్" "దిశతి-ఉపదిశతి ఇతి దేశికః"** అనే వ్యుత్పత్తినిబట్టి ఈపదం ఉపదేశాన్ని చేసే ఆచార్యుణ్ణి నిర్దేశిస్తుంది. **"శీరుఱుతల్"-** ఐహిక- ఆముష్మిక ఫలాలను పూర్ణంగా పొందడం.

ఈవిధంగా వరదనారాయణ గురువులనే కోయిల్ కన్దాడై అణ్ణన్, భగవానుడు ఈ భూలోక వాసులు అనుసంధించి, సంపదను పొందేటట్లు **"శ్రీశైలేశ దయాపాత్రమ్"** అనే తనియన్ మూలంగా మణవాళమహాముల మహిమను వ్యక్తం చేసి, ఆచార్యత్వపూర్తి పొంది సత్తను పొందినట్లే, అందఱు అనుసంధించి, సంపదను పొందేటట్లు ఆ మామునుల గొప్పతనాన్ని ఈ కణ్ణినుణ్ శిఱుత్తామ్బు ప్రబంధంద్వారా వ్యక్తపఱచి వరదనారాయణ గురువులనబడే తమ తిరునామం సార్థకం అయేటట్లుగా ఆచార్యత్వపూర్తిని పొంది. సత్తను పొందారు.

ఈప్రబంధంలో **"శ్రీశైలేశదయాపాత్రమ్"** ఇత్యాది తనియన్‌లోని అర్థాలు అన్నీ అణగి ఉన్నాయి. **"శీరున్ఱ శెఞ్జొన్ఱిరువాయ్‌మొழிప్పిళ్ళై శెమ్ముకముమ్ తారున్ఱ మార్బుమ్ తళిరేయ్ ప్పదఙ్గళుమ్ తమ్మనత్తు ప్పూరిత్తు వాழుమ్ మణవాళమాముని"** అని అంటూ మామునులు తిరువాయ్‌మొழிప్పిళ్ళైను

ధ్యానించడమనే కార్యాన్ని తెలుపడంద్వారా దానికి కారణం అయిన **"శ్రీశైలేశదయా పాత్రత్వమ్"** (తిరువాయ్‌మొழிప్పిళ్ళై దయకు పాత్రమైన స్వభావం) తెలుపబడింది. కారుణికులేకదా ధ్యానించదగినవారు.

"తొల్లరుళ్ ఞానమ్ విళైత్తు" (6) అని, **"మణవాళమాముని తామవతారమ్ శెయ్‌దిరున్దాల్ శడకోపర్ తిరువాయ్‌మొழி యోడు కడలోశైయోడు ఎన్న వాశియుణ్డే''** (12) అని క్రమంగా తత్త్వ-హిత-పురుషార్థజ్ఞానాన్ని, భగవద్విషయార్థజ్ఞానాన్ని ఇతరులకు కలిగేటట్లుగా చేస్తున్నారని చెప్పడంద్వారా మామునులకు గల జ్ఞానం, **"శిత్తరఞ్జెయ్ శిన్ఱై పయఱ్కెడ చ్చెన్ఱితన్నాల్ వన్దిత్తు నిచ్చలుమ్ వాయార వాழ్త్తుమ్ మెయ్‌మ్మా మఱైయోర్ పున్దిక్కుళ్ మేవుమ్ వరయోకి"** అని అంటూ మామునులు శ్రీరంగనాథుని భక్తులచే ధ్యానింపబడడాన్ని తెలుపడంద్వారా మణవాళమహాములకు శ్రీరంగనాథునిపట్ల గల భక్తి చెప్పబడింది. మామునులకు శ్రీరంగనాథుని పట్ల లేకపోతే శ్రీరంగనాథుని భక్తులు వారిని ధ్యానించరుకదా !

ఇక, **"ముక్కోల్ తరిత్త మణవాళమాముని"** (5) అని వైరాగ్యం, **"మణవాళమాముని క్కార్‌ముకిలై"**(2) అని ఔదార్యం, **"కరుణై మణవాళ యోకియై"** (8) అని దయ- ఈవిధంగా **"ధీభక్త్యాది"** అన్నపుడు ఆదిపదంచేత సంగ్రహింపబడ్డ కొన్ని గుణాలు సూచింపబడ్డాయి. ఈరీతిలో **"ధీభక్త్యాది గుణార్ణవత్వమ్"** సూచింపబడింది. **"ఎతిరాశన్ తుయ్య పదఙ్గళ్ నెఞ్జిల్ మఱువాద శీలన్ మణవాళమాముని"** (3) అని యతీంద్రప్రవణత్వం (భగవద్రామానుజుల విషయంలో ప్రావణ్యాన్ని కల్గిఉండడం) సూచింపబడింది. **"మణవాళమాముని, మణవాళ యోకి, వరయోకి, మణవాళముని"**- అని పలుచోట్ల ప్రయోగించడంవల్ల రమ్యజామాతృమునిత్వం చెప్పబడింది.

"మణవాళయోకియై వాழ్త్తువనే", "వాழ్త్తువ నెన్ఱై మణవాళమాముని మామలర్‌త్తాళ్ తాழ్త్తువన్ యావన్ తాళిణైక్కీழ్ శిరమ్ తారణియిల్" (7) అని స్తుతి, అభివాదనం అనే **"వది"** ధాతువుయొక్క అర్థాలు తెలుపబడడంచేత **"వన్దే"** అనే పదంయొక్క అర్థం స్పష్టంచేయబడింది. ఈవిధంగా ఈ ప్రబంధం **"శ్రీశైలేశ దయాపాత్రమ్"** తనియన్‌ను సమగ్రంగా వివరిస్తున్న విషయం వ్యక్తమైనది కదా.

జీయర్ తిరువడికళే శరణమ్
కోయిల్ కన్దాడై అణ్ణన్ తిరువడికళే శరణమ్

ప్రాస్తావికం

కర్కటే పుష్యసంజాతం వాదిభీకర మాశ్రయే ।
వేదాంతాచార్యసచ్ఛిష్యం వరయోగిపదాశ్రితమ్ ॥

శ్రీ వైష్ణవ పూర్వాచార్యులలో అత్యంతం ప్రసిద్ధులు, సాక్షాత్తు శ్రీరంగనాథుడే స్వయంగా ఆశపడి ఆశ్రయించినవారు అయిన ఆచార్య శ్రేష్ఠులు శ్రీమద్వరవర మునులు. వీరికి గల అష్టదిగ్గజాలనే ఎనిమిదిమంది శిష్యులలో ప్రతివాది భయంకరం అణ్ణన్ ఒకరు. వీరి అభిజనం కాంచీపురం. ముదుమ్బైవంశానికి చెందిన అనంతాచార్యులనే మహనీయులకు కంచిసమీపంలోని **"తిరుత్తణ్‌కా"** అనే క్షేత్రంలో క్రోధ (1361 సం।।రం) ప్లవర్షం, ఆషాఢమాసం (ఆడిమాసం) కృష్ణచతుర్దశి మంగళవారంనాడు పుష్యమీనక్షత్రంలో వీరు అవతరించారు. వీరి బాల్యనామం **"హస్తిగిరినాథనణ్ణన్".** వీరి బాల్యం, విద్యాభ్యాసాదులు అన్నీ కాంచీపురంలోనే గడచినవి. అత్యంతప్రతిభావంతులైన వీరు అచిరకాలంలోనే పలు శాస్త్రాల్లో, సంస్కృతవేదాంతంలో నిరుపమానమైన పాండిత్యాన్ని గడించి ప్రసిద్ధి చెందారు. శ్రీవేదాంతదేశికులు, వారి కుమారులు నయనవరదాచార్యుల వారివంటి పెద్దల అనుగ్రహానికి పాత్రులయ్యారు. తమకు ఆచార్యులైన నయనవరదా చార్యులవారితో వాదించాలని వచ్చిన మయావాదిని అణ్ణన్ ఓడించడాన్ని చూచిన నయనవరదాచార్యులవారు వీరిని సంతోషంతో "ప్రతిభయంకరా! రండు" అని సాదరంగా సంబోధించడంవల్ల, ఆ పేరే వీరికి నిరూపకనామమైనదట. కొంతకాలం కంచిలో వరదరాజస్వామి సన్నిధిలో తీర్థకైంకర్యాన్ని నిర్వహించిన వీరు తరువాత తాతాచార్యులవారి ఆదేశానుసారం తిరుమలకు వచ్చి, అక్కడ శ్రీవేంకటేశుని తిరువారాధనకు అవసరమైన తీర్థాన్ని తీసికొనివచ్చే కైంకర్యాన్ని నిర్వహించారు. ఆ సమయంలోనే శ్రీవరవరమునుల గుణవైభవాన్ని, పాండిత్యాన్ని గూర్చి విని, వారిని సేవించాలనే ఆశతో శ్రీరంగానికి చేరి, అక్కడ వరవరమునుల పాదసన్నిధిని ఆశ్రయించి, **"తేవు మత్తఱియేన్"** అన్న రీతిలో వారివిషయంలో గొప్ప ప్రావణ్యాన్ని పొందారు. ఒక పర్యాయం శ్రీవరవరమునులతో పాటు వీరు తిరుమలకు వేంచేసినపుడు ఆచార్యనియమానుసారం

శ్రీవేంకటేశ్వరుని విషయంగా శ్రీవేంకటేశసుప్రభాతం, ప్రపత్తి, స్తోత్రం, మంగళాశాసనం అనే నాల్గు స్తోత్రాలను ఆశువుగా అనుగ్రహించారు అని పెద్దల సూక్తి. ఇంతేకాక, సంస్కృతభాషలో అష్టశ్లోకీ వ్యాఖ్యానం, శ్రీవరవరమునుల సుప్రభాతం ప్రపత్తి, మంగళాశాసనం, శ్రీవరవరముని శతకం మొదలైన పలు గ్రంథాలను రచించారు.

ద్రవిడభాషలో శ్రీవరవరమునుల దివ్య మంగళవిగ్రహాన్ని స్తుతిస్తూ అణ్ణన్ రచించిన అమలనాదిపిరాన్ ప్రబంధాన్ని (పాదాదికేశమాలై ప్రబంధం) నిత్యానుసంధేయప్రబంధంగా పెద్దలు నిశ్చయించారు. ఈ ప్రబంధం తిరుప్పాణ్ ఆళ్వార్లు శ్రీరంగనాథుని విషయంలో అనుగ్రహించిన అమలనాది పిరాన్ ప్రబంధంతో పలువిధాలైన సౌమ్యాలను కలిగియున్నది. ప్రాచీననిత్యానుసంధేయ శ్రీకోశాలలో ఈప్రబంధం ముద్రింపబడినా, ఈ మధ్యకాలంలో ముద్రింపబడిన కోశాలలో ఇది చోటుచేసుకోనందువల్ల ఈ తరంవారికి దీనిని గూర్చి తెలిసే అవకాశం లేకుండాపోయే ప్రమాదం ఏర్పడింది. అందువల్ల మరల దీనిని ప్రచారం చేయాలనే ఉద్దేశ్యంతో వివరణసహితంగా ఈ ప్రబంధం ముద్రింపబడుతున్నది. ఈ వివరణలోని లోపాలను సహృదయులు సహించవలసినదిగా ప్రార్థిస్తున్నాను. ఆళ్వార్‌దివ్యప్రబంధ ప్రాజెక్ట్ ద్వారా దీనిని ముద్రించడానికి తగిన ప్రయత్నాన్ని చేసిన మిత్రులు ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీచొక్కలింగం గారికి కృతజ్ఞతలు.

ఇట్లు, వ్యాఖ్యాత

శింగరాచార్యులు

శ్రీమణవాళమహామునుల విషయంగా

ప్రతివాదిభయంకరమ్ అణ్ణన్ అనుగ్రహించిన

అమలనాదిపిరాన్ (పాదాది కేశమాలై)

సవ్యాఖ్యానము

1. **పోద చ్చివన్దు పరిమళమ్ వీశి పుదుక్కణిత్త**
శీదక్కమలత్తై నీరేఱు వోట్టి చ్చిఱన్దడియేన్
ఏదత్తై మాఱ్ఱు మణవాళయోకి యినిమై తరుమ్
పాదక్కమలఙ్గళ్ కణ్డే నెనక్కు ప్పయమిల్లైయే

పోద చ్చివన్దు = చాలా ఎట్టనిదై, పరిమళమ్ = సువాసనను, వీశి = వీచి, పుదుక్కణిత్త= అపుడే వికసించడంచేత నూతనత్వాన్ని కల్గి, శీదమ్ = శైత్యాన్ని కల్గిన, కమలత్తై = కమలాన్ని, నీర్ ఏఱు = నీటిలో ప్రవేశించేటట్లు, ఓట్టి =తఱిమి కొట్టి, శిఱన్దు = గొప్పతనాన్ని కల్గి, అడియేన్ = దాసుని, ఏదత్తై = దోషాన్ని, మాఱ్ఱుమ్ = లేకుండా చేసే, మణవాళయోకి = మణవాళమహామునుల, ఇనిమై తరుమ్ = సేవించినంతనే మాధుర్యాన్ని, ఆనందాన్ని కల్గించే, పాద క్కమలఙ్గళ్ = శ్రీపాదాలు అనే తామరపూలను, కణ్డేన్ =దర్శించిన, ఎనక్కు =(ఇక) నాకు, పయమ్ = ఏ భయం, ఇల్లై = లేదు (ఏకారం నిశ్చయార్థకం)

చాలా ఎట్టనిదై, సువాసనను వెదజల్లుతూ అపుడే వికసించడంచేత నూతనత్వాన్ని, చల్లదనాన్ని కల కమలాన్ని దానికంటే తనకు ఉన్న సకలవిధ వైలక్షణ్యంతో నీటిలోనికి తఱిమికొట్టినవి, దాసుని దోషాలను అన్నిటినీ దర్శనమాత్రంచేతనే పోగొట్టేవి, మనస్సులో తీయదనాన్ని కల్గించేవి అయిన మణవాళమహామునుల శ్రీపాదపద్మాలను దర్శించిన నాకు ఇక ఏ భయం లేదు.

లోకంలోని కమలాలకు ఎట్టదనం, సౌగంధ్యం, శైత్యం- మొదలైన గుణాలన్నీ ఉన్నా, ఈ గుణాలలో మణవాళమాముని పాదపద్మాలు వాటిని మించి ఉన్నందున అవి కమలాలను తఱిమి నీటిలో ప్రవేశించేటట్లు చేశాయని అనడం ఒక అందమైన ఉత్ప్రేక్ష. పద్మాలు నీటిలో ఉండడం సహజమే అయినా దానికొక హేతువు ఉత్ప్రేక్షింపబడిందికదా! దీనివల్ల ఉపమానం అయిన కమలాలకంటే ఉపమేయం

అయిన పాదాలకు ఆధిక్యం స్ఫురించడంచేత వ్యతిరేకాలంకారంకూడా వ్యంగ్యం. ఈ విశేషం ప్రబంధంలో సర్వత్ర గమనించవచ్చు. పైగా, కమలాలకు మనస్సులోని మాలిన్యాన్ని తీర్చే శక్తి లేకపోవడం, శ్రీపాదాలకు ఆ మహిమ ఉండడం అనే ఆధిక్యంకూడా గమనార్హం.

"ఏదత్తై మాఱ్ఱుమ్", "ఇనిమై తరుమ్" అనే విశేషణాలద్వారా వ్యక్తం అయే శ్రీపాదాల దోషహరత్వం, మాధుర్యదాయిత్వం శ్రీపాదాల అనిష్టనివృత్తి, ఇష్టప్రాప్తి రూపరక్షణకార్యపూర్తిని తెలుపుతున్నవి. దీనివల్ల శ్రీపాదాల వైలక్షణ్యం తెలుస్తున్నది. వేదం భగవానుని విషయంలో వేదం **"యదాహ్యేవైష ఏతస్మిన్ అదృశ్యేఽనాత్మ్యేఽనిరుక్తేఽనిలయనేఽభయం ప్రతిష్ఠాం విందతే, అథ సోఽభయంగతో భవతి"** (ప్రాకృత చక్షువులతో దర్శింప వీలులేనివాడు, ప్రాకృత శరీరం లేనివాడు, దేవమనుష్యాది పదాలతో నిర్దేశించడానికి వీలులేనివాడు, తనకోసం ఏ ఆధారం లేనివాడు అయిన ఈ పరమాత్మ పట్ల సంసారభయం లేకుండా ఉండడంకోసం భక్తియోగాన్ని ఎపుడు పొందుతాడో అపుడు అతడు భయం లేనివాడు అవుతాడు.) అని పల్కిన అర్థాన్ని అణ్ణన్ వరవరమునుల శ్రీపాదాల పట్ల **"పాదక్కమలఙ్గళ్ కణ్డేన్ ఎనక్కు పయమ్ ఇల్లై"** అని అంటూ అనుసంధించడం విశేషం. పైన పేర్కొన్న విధంగా శ్రీపాదాల రక్షకత్వపూర్ణతను తెలిసిన తర్వాత ఇక భయం లేకుండా ఉండడంలో ఆశ్చర్యం లేదుకదా! **"నిర్భయో నిర్భరోఽస్మి"** అని చెప్పవచ్చుకదా! **"సిద్ధి ర్భవతి వా నేతి సంశయోఽచ్యుతసేవినామ్, నిస్సంశయ స్తు తద్భక్తపరిచర్యారతాత్మనామ్"** (అచ్యుతుని సేవించేవారికి సిద్ధి కల్గుతుందా? లేదా? అనే సందేహం ఉండవచ్చు. కాని, ఆ అచ్యుతుని భక్తులను సేవించేవారికి కార్యసిద్ధి కల్గడంలో మాత్రం ఏ సందేహం లేదు) అని చెప్పబడింది కనుక వారికి ఉత్తమపురుషార్థ ప్రాప్తి సిద్ధం. అందువల్ల భయం ఉండదు. **"అభీతి రిహ యజ్ఞేషామ్"** ఇత్యాది సూక్తుల అర్థం వరవరమునులపట్ల ఇక్కడ భావ్యం.

ఆపాదచూడం శ్రీవరవరమునుల దివ్యమంగళవిగ్రహాన్ని వర్ణించే ఈ ప్రబంధం శ్రీపాదాల వర్ణనతో ప్రారంభమైనది. అణ్ణన్ అనుగ్రహించిన వరవరమునుల వాళ్ఱిత్తిరునామంకూడా- **"శెయ్యతామరైత్తాళిణై వాళ్ఱియే"** అని అంటూ శ్రీపాదాల వర్ణనతోనే ఆరంభం అవుతున్నది. తిరుప్పాణ్ అమలనాదిపిరాన్ ప్రబంధంలో సైతం **"అరఙ్గత్తమ్మాన్ తిరుక్కమలపాదమ్ వన్దు"** అని శ్రీరంగనాథుని

శ్రీపాదాల స్తుతితోనే మొదలైనది. **"దేవా శ్చరణతః పునః"** అని పాదాదికేశంగా దివ్యుల వర్ణనను చేయాలనే ఆలంకారికసంప్రదాయం ఇందులో పాటింపబడింది. దివ్యుల వర్ణనకు విధింపబడ్డ క్రమం ఇందులో పాటింపబడినందున శ్రీవరవర మునుల ఆదిశేషుల అవతారం అనే అంశం స్ఫురిస్తున్నది. అంతేకాక **"ఆచార్యः స హరి స్సాక్షాత్"** (ఆచార్యుడు సాక్షాత్ ఆ హరియే), **"దేవ మివాచార్య ముపాసీత"** (దైవంవలే ఆచార్యున్ని ఉపాసించాలి), **"యస్య దేవే పరా భక్తిः యథాదేవే తథా గురౌ"** (ఎవనికి దైవం పట్ల ఉండే భక్తి గురువు పట్ల ఉన్నదో) ఇత్యాది సూక్తుల అర్థాలు అనుసంధింప బడ్డాయి. **"పోద"**- పర్యాప్తం అయిన అని అర్థం. చాలు అనే అర్థంలో **"పోదుమ్"** అనే వ్యవహారం ఉండడాన్ని గమనించవచ్చు. పర్యాప్తం, పూర్ణం - అయిన అనే అర్థాన్ని ఇచ్చే **"పోద"** అనే పదాన్ని ప్రబంధప్రారంభంలో ప్రయోగించడంవల్ల కావ్యాదిలో చేయదగిన మంగళాచరణం చేసినట్లయింది. మంగళార్థకవాచకాలను ఆదిలో ప్రయోగించడం మంగళాత్మకమే కదా! **"పోర"** అనే పాఠాంతరం ఉన్నా, అది ప్రాసాను గుణంకాదు. **"ఇనిమై తరుమ్"** అనే ప్రయోగంవల్ల శ్రీవరవరమునుల దివ్యమంగళ విగ్రహంయొక్క మాధుర్య గుణం చెప్పబడింది.

2. వేఱ్ఱ క్కుఱుత్తి నఱ్ఱై ప్పఱిత్తు విరై మరువు
వాఱ్ఱైప్పరువత్తి నాకారఙ్కొణ్డు వళమ్పునైన్ద
ఏఱ్ఱైక్కిరఙ్గు మణవాళయోకి యిరు కుఱఙ్గై
కేఴ్ఱన్ఱ నెఞ్జిల్ వైప్పేఱ్కొరు కాలముమ్ కేడిలైయే

వేఱ్ఱ క్కుఱుత్తిన్ = ఏనుగుతొండంయొక్క, అఱ్ఱై = అందాన్ని, పఱిత్తు = నిందించి, (దానిని మించి), విరై = సువాసనను, మరువు = కల్గిన, వాఱ్ఱై ప్పరువత్తిన్ = అరటిబోదెల, ఆకారమ్ = రూపాన్ని, కొణ్డు =గ్రహించి, ఏఱ్ఱైక్కు= జ్ఞానంలో దరిద్రుణ్ణి అయిన నాకు, ఇరఙ్గుమ్ = కరుణను చూపే, మణవాళ యోకి = మణవాళ మహామునుల, వళమ్ పునైన్ద = బాగా బలిసిన, ఇరు కుఱఙ్గై = రెండు ఊరువులను, కేఴ్ అన్ఱ = స్వరూపప్రకాశంలేని, నెఞ్జిల్ = మనస్సులో, వైప్పేఱ్కు = నిలిపేవారికి, ఒరు కాలముమ్ = ఏసమయంలోను, కేడు ఇలై = చెడ్డ లేదు (ఏకారం నిశ్చయార్థకం)

"ఊరు స్తు కరిహస్తేన కదళ్యా కరభేన చ" అని ఆలంకారికసమయం. తొడలను వర్ణించేటపుడు ఏనుగు తొండాన్ని, అరటిబోదెలను, కరభమనబడే చిటికెనవేలు

చివరనుండి మణిబంధం ప్రారంభంవరకు గల చేతి భాగాన్ని ఉపమానాలుగా చెప్పాలి అనే ఈ నియమం ఇందులో పాటింపబడింది. **"మధుకైటభస్య రంభాకరభకరీంద్రకరాభి రూప్యదర్పమ్"** అని పరాశరభట్టర్‌కూడా శ్రీరంగరాజస్తవంలో పలికారు.

ముందు పాశురంలో **"కణ్డేన్"** అని దర్శనమాత్రమే చెప్పబడగా, ఇందులో **"నెఞ్జిల్ వైప్పేఱ్కు"** అని దర్శించిన దానిని అనవరతం ధ్యానించే స్థితి తెలుపబడింది. **"అసన్నేవ స భవతి అసద్బ్రహ్మేతి వేద చేత్, అస్తి బ్రహ్మేతి చేత్ వేద సంత మేనం తతో విదుः"** అని అంటూ వేదం భగవానుడున్నాడని, అతడు దివ్యమంగళవిగ్రహ విశిష్టుడని, కల్యాణగుణపూర్ణుడని, విభూతిద్వయవిశిష్టుడని భావించినవారికి సత్త కలుగుతుందని అన్నట్లే అణ్ణన్‌కూడా తమ ఆచార్యుల దివ్యమంగళవిగ్రహధ్యానాన్ని చేసేవారికి ఏ కీడు లేదని అన్నారు. ఇక్కడ కీడు అంటే ఆత్మనాశమే. **"వళమ్ పునైన్ద"**- దార్ఢ్యాన్ని కల్గిన- అని అర్థం. **"నల్ వళమ్ శేర్ పఱ్ఱన తిరుక్కోళూరే"** అనే ప్రయోగం గమనార్హం. లేక, **"వళమ్"** అంటే అందం అని కూడా చెప్పవచ్చు. **"వళమాక ఎన్టపడి = అతావతు అఱ్ఱకియతా ఎన్టతల్."** (ఈడు -3-9-2) అని ఈడు వివరణం. ప్రకృతంలో అందం నిండిన- అని అర్థం.

3. తేనమర్ మాలై మణవాళయోకి తిరుమరుఙ్గల్
ఈన మిలాద విళమైయినారు మెఱ్ఱిళ్చకనమ్
వానిలై యుయ్త్త తువరాడై యిన్టెన్ మనత్తై విట్టు
త్తానకలామ లెనై యూఴికాలముమ్ తాఙ్గియవే

తేన్ అమర్ మాలై = మధువు పొందికగా ఉండే (స్రవించే) పూమాలికలను ధరించిన, మణవాళ యోకి = మణవాళ మహామునుల, తిరు మరుఙ్గల్ = అందమైన పార్శ్వభాగాలు, ఈనమ్ ఇల్లాద = తక్కువ కాని, ఇళమైయిన్= లేత వయస్సుతో, అరుమ్ = స్థిరంగా ఉండే, ఎఱ్ఱిల్ = ప్రకాశించే, శకనమ్ = జఘనప్రదేశం, వాన్ = ఉన్నతం అయిన, నిలై = స్థానంలోనికి, ఉయ్త్త = ఉద్ధరించిన, తువర్ ఆడై = ఎఱ్ఱని కాషాయం - అనే ఇవి, ఇన్ట = ఇపుడు, ఎన్ మనత్తై విట్టు = నా మనస్సును వీడి, తాన్ = తాను, అకలామల్ = విడువకుండా, ఎన్నై = నన్ను, ఊఴికాలముమ్ = యుగకాలం అంతా, (బ్రహ్మకల్పం అంతా), తాఙ్గియ = తమ శక్తితో ధరిస్తున్నవి. (ఏ-ఆశ్చర్యార్థకం, లేక ఆనందార్థకం)

హీనమనే సంస్కృతపదమే ఈనమని మారింది. **"తువర్"**- ఎట్టని- **"తువర్ ఎన్నానిఱ్ఱ క్కరైయినాలెట్టదు"** (ఈడు-4-8-4) అని ఈడు ప్రయోగం. జఘనశబ్దమే **"శకనమ్"** అయినది. ముందు పాశురంలో అణ్ణన్ వరవరమునుల ఊరువులను తాము నిరంతరం ధ్యానిస్తున్నామని స్వగతస్వీకారాన్ని తెలిపారు. ఇందులో వరవరమునుల జఘనం, ఇరు పార్శ్వప్రదేశాలు, కాషాయం తమను విడువకుండా బ్రహ్మకల్పంవరకు తమ శక్తితో ధరిస్తున్నవని అంటూ అంతకంటే గొప్పది అయిన పరగతస్వీకారాన్ని ప్రస్తావించడం విశేషం.

4. వన్దిక్క వాழ్ విత్తరుళ్ మణవాళమాముని వడివై
చ్చిన్దిక్కవుమ్ అరిదా మழకార్ నిరైల్ తికழ్ శుழిపోల్
ఉన్దిచ్చుழి యెనదుళ్ళమ్ శూழైకొణ్డాయదెన్దుమ్
శన్దిత్తవర్ కణ్ణు నెఞ్జుమ్ కొళ్ళానిఱ్ఱుమ్ తామిరున్దే

వన్దిక్క = (దాసులు) స్తుతించినంతనే (నమస్కరించినంతనే), వాழ్ విత్తు అరుళ్ = (వారిని) ఉజ్జీవింపజేసి, పరమపదాన్ని చేర్చి అనుగ్రహించే, మణవాళ మాముని = మణవాళమహామునుల, వడివై = దివ్యమంగళవిగ్రహాన్ని, శిన్దిక్కవుమ్ = చింతించడానికికూడా, అరిదు ఆమ్ = దుర్లభమే అయేటట్లున్న, అழకు ఆనిరైల్ = సౌందర్యప్రవాహంలోని, శుழిపోల్ = సుడివలె, ఉన్ది చ్చుழి= గుండ్రని వారి నాభి, ఎనదు ఉళ్ళమ్ = నా మనస్సును, శూழై కొణ్డు = తెలియకుండా కొల్లగొట్టి (చూఱగొని), ఆయదు = దానిని కల్గిఉన్నది, ఎన్దుమ్ = ఎల్లప్పుడూ, తామ్ ఇరున్దు = తాము ఉన్న రీతిలోనే (తామున్నచోటనే ఉంటూ), శన్దిత్తవర్ = తనను చేరిన వారియొక్క, కణ్ణుమ్ = కన్నులను, నెఞ్జుమ్ = మనస్సును, కొళ్ళా నిఱ్ఱుమ్ = కొల్లగొడుతుంది. (ఏ- ఆశ్చర్యార్థకం!)

"ఏకైకస్మిన్ పర మవయవేఽనంతసౌందర్యమగ్నమ్" అని అంటూ పరాశరభట్టర్ శ్రీరంగనాథుని సౌందర్యాన్ని ఒక ప్రవాహంగా చూపించినట్లే అణ్ణన్‌కూడా వరవరమునుల అందాన్ని "అழకాఱు" అని ఒక నదీప్రవాహంగా రూపించారు.

"వన్దిక్క, శిన్దిక్క, శన్దిత్త"- అనే పదాలు సంస్కృతభవాలు. **"వది- అభివాదన స్తుత్యోఃయ"** అనే ధాతువునుండి పుట్టిన, **"వన్దిక్క"** అనే క్రియారూపానికి "నమస్కరించినంతనే" అని, "స్తుతించినంతనే"- అనే రెండు అర్థాలనే కాకుండా

త్రికరణాత్మకమైన సేవలలో మిగిలినది అయిన "మానసికంగా భావించినంతనే" అనే అర్థాన్నికూడా ఉపలక్షణవిధిలో చెప్పడంలో స్వారస్యం ఉన్నది. ప్రపత్తి ముఖ్యంగా మానసికమే కదా! అయితే, **"వడివై చ్చిన్దిక్కవుమ్, అరిదామ్"** అనే ప్రయోగం ఏవిధంగా సరిపోతుంది? అని అంటే, మణవాళమామునుల సౌందర్యం పూర్ణంగా దర్శించి, భావించడానికి సాధ్యం కానిది- అని ప్రకృతప్రయోగానికి అర్థం. కాబట్టి అర్థంలో ఎటువంటి క్లేశం లేదు. **"వన్దిక్క వాழ్ విత్తరుళ్"** అనే ప్రయోగానికి హృదయపూర్వకంగా కాక యాదృచ్ఛికంగా నమస్కరించినా వరవరమునులు రక్షిస్తారు - అనే అర్థస్వారస్యం స్ఫురిస్తున్నందున **"తిరుమాలిరుమ్ శోలైమలై ఎన్నే ఎన్న"** అత్యాది ఆழ్వార్ల సూక్తుల భావాలు ప్రకృతంలో వరవరమునులపట్ల భావించబడ్డాయని చెప్పవచ్చు. **"యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ"** అనే శ్రుత్యర్థం కూడా ప్రకృతంలో మణవాళ మహామునుల సౌందర్యం విషయంలో అందంగా అనుసంధింపబడడం గమనార్హం. **"ఉన్దిచ్చుழి"** - గుండ్రని బొడ్డు. నాభీవలయం. **"ఓరవయవత్తిలే నిన్ఱ శుழి శుழిక్కుమాయ్త్తు"** అని ఒన్బది నాయిరప్పడి (7-1-10) సూక్తి. నాభిని నీటిసుడితో పోల్చడం కావ్యసంప్రదాయం. **"నాభీరసాతలావర్తప్రహ్లాద కూపనదాదిభిఃఽ"** అని అలంకారశేఖర వచనం. **"సౌందర్యామృతసారపూరపరివాహావర్తగర్తాయితం యాతఃఽ నాభిఃఽ"** అని కూరేశుల సుందరబాహుస్తవంలోని (57) ప్రయోగాన్ని స్మరించవచ్చు. **"శూழై కొణ్డు"**- సంపదను కలవాని దగ్గరనుండి అతనికి ఏమాత్రం తెలియకుండా అపహరించి- అని అర్థం. **"ఇవర్‌కళై చ్చూழై కొళ్ళుకిఱ పూశలిలే"** అని పెరియతిరుమొழి (1-7-2) వ్యాఖ్యలోని ప్రయోగం. **"తామిరున్దు కొళ్ళానిఱ్ఱుమ్"** అనే ప్రయోగం మణవాళమహామునుల నాభికి భక్తుల మనస్సును నేత్రాలను కొల్లగొట్టడంలోని అసాధారణసామర్థ్యాన్ని తెలుపుతున్నది. లోకంలోని చోరులు తాము కొల్లగొట్టదలచిన వస్తువు దగ్గరకు పోయినపుడే దానిని కొల్లగొట్టగలరు. కాని, వరవరమునుల నాభిమాత్రం తానున్న చోటనే ఉంటూ కొల్లగొట్టడం విశేషం. **"కణ్ణుమ్ నెఞ్జుమ్ కొళ్ళానిఱ్ఱుమ్"** అనే ప్రయోగ స్వారస్యాన్ని బట్టి **"రూపౌదార్యగుణైఃఽ పుంసాం దృష్టిచిత్తాపహారిణమ్"**అనే శ్రీరామాయణ శ్లోకార్థం ఇందులో వరవరమునుల పరంగా అన్వయింపబడింది అని చెప్పవచ్చు.

5. ఆరుమ్ వణఙ్గుమ్ మణవాళమాముని యమ్బుయముమ్
కారుమ్ శురబియుమ్ పోలే వழఙ్గుమ్ కైత్తామరైయిల్

శేరు న్తిరుత్తణ్డుమ్ శేవిత్త మానిడర్ తీవినైయాల్
ఈరుమ్బుడి పిఱవార్ తిరునాట్టిన్బమెయ్దువరే

ఆరుమ్ = ఎవరైనా (అందఱు), వణఙ్గుమ్ = నమస్కరించే, మణవాళ మా ముని= మణవాళమహామునుల, అమ్ = అందమైన, పుయముమ్ = భుజములను, కారుమ్= మేఘము, శురబియుమ్ పోలే = కామధేనువువలె, వழ్ఙుమ్ = ప్రత్యుపకారాన్ని ఆశించకుండా అనుగ్రహించే, కై త్తామరైయిల్ = శ్రీహస్తమనే తామరపూవులో, శేరుమ్= చేరి ఉండే, తిరు త్తణ్డుమ్ = త్రిదండాన్ని, శేవిత్త = సేవించిన (దర్శించిన), మానిడర్= మానవులు, తీ వినైయాల్ = దుష్కర్మవల్ల, ఈరుమ్ = హింసించే, పడి = భూమిలో, పిఱవార్ = జన్మించరు, తిరు నాట్టు = పరమపదంలోని, ఇన్బమ్ = ఆనందాన్ని, ఎయ్దువర్= పొందుతారు, (ఏ -నిశ్చయార్థకం, లేక, ఆశ్చర్యార్థకం)

శ్రీవరవరమునుల అందమైన భుజాలను, శ్రీహస్తంలో అందంగా అమరి ఉండే త్రిదండాన్ని దర్శించినవారికి దుష్కర్మఫలంగా సంభవించే ఇహలోకజన్మ కలుగదు. వారు పరమపదాన్ని చేరి, పరమప్రాప్యం అయిన ముక్తానందాన్ని పొందుతారు- అనే భావమే కాక, వరవరమునుల భుజాలను, శ్రీహస్తంలోని త్రిదండాన్ని సేవించినవారు **"తీవినైయాల్ ఈరుమ్ పడి తిరునాట్టిన్బమెయ్దువర్"** - దుష్కర్మలతో బాధించే ఈ లోకంలోనే పరమపదానందాన్ని పొందుతారు- అనే భావంకూడా స్ఫురించడం విశేషం. ఇటువంటివారు **"విణ్ణుళారిలుమ్ శీరియరే"** అన్నట్లు పరమపదవాసులకంటే విలక్షణులు- అనే అర్థాన్నికూడా చెప్పడంలో స్వారస్యం ఉన్నది. **"భుజ, సురభి, మానుష దండ"** అనే సంస్కృత శబ్దాలు **"పుయమ్, శురబి, మానిడర్ తణ్డు"** అనే మార్పును పొందాయి. సంస్కృతపదంలోని **'జ'** కారం తమిళంలో **'య'** కారంగా మారడం **"అంబుజ-అమ్బుయ, అజ - అయన్"** ఇత్యాదులలో గమనించవచ్చు. అదే రీతిలో సంస్కృతంలోని మూర్ధన్యాక్షరం అయిన **'ష'** కారం తమిళంలో వేఱొక మూర్ధన్యం అయిన **'ఴ'**కారంగా మారడం **'భాషా-పాడు', 'విష-విడమ్'** మొదలైన చోట్ల చూడవచ్చు. **"నాభ్యర్థితో జలధరోఽపి జలం దదాతి'** అని చెప్పబడ్డ రీతిలో మేఘం ఎవరూ అడుగకుండానే, తరతమవిభాగం చూడకుండా, ప్రత్యుపకృతిని ఆశించకుండా తీయని జలాన్ని వర్షించడం ప్రత్యక్షసిద్ధం. కామధేనువుకూడా అడిగినవాటిని అన్నిటినీ ఉదారంగా ఇస్తుందని ప్రసిద్ధి. **"సురభి"** శబ్దం కామధేనువాచకమని **"సురభిః శల్లకీ మాతృభిత్సురగోషు యోషితి"** అని మేదినీఘంటువు తెలుపుతున్నది. **"సుష్మ రభంతే, రభ-రాభస్యే"** అనే వ్యుత్పత్తిని కల సురభిశబ్దం ప్రకృతంలో భక్తులను తత్త్వజ్ఞాన ప్రదానం ద్వారా ఆనందింపజేస్తుందనే అర్థం ఇస్తుంది. వరవరమునుల శ్రీహస్తాన్ని ఈ రెండింటితో పోల్చడం అమూల్యమైన తత్త్వజ్ఞానసంపదను ఉదారంగా అనుగ్రహించే దాని స్వభావాన్నిబట్టి. **"శానక్కై తా"** అనికదా ఆழ్వార్లు ప్రార్థించారు. **"సాక్షా న్నారాయణో దేవః కృత్వా మర్త్యమయీం తనుమ్, మగ్నా నుద్ధరతే లోకాన్ కారుణ్యాచ్ఛాస్త్రపాణినా"** అన్నట్లు భగవానుడుకూడా ఆచార్యావతారాన్ని ఎత్తినపుడు శాస్త్రపాణితోనేకదా ఉద్ధరిస్తాడు. ''ఆరుమ్ వణఙ్గుమ్'' అన్నందున వరవరమునుల సౌలభ్యం ప్రస్తావింపబడింది.

6. తడఙ్కొణ్ డ కోయిన్ మణవాళమాముని తామరైత్తార్
వడఙ్కొణ్ డ మార్బినిల్ వణ్ పురినూలు మెనదు నెఞ్జిల్
ఇడఙ్కొణ్డడఙ్గ ఎழுదివైత్తే నిని వల్వినైకాళ్ !
తిడఙ్కొణ్ డ నీశర్ తన్దేయత్తిలేకిడుమ్ తీదఱవే

తడమ్ కొణ్డ = తటాకాలను నిండుగా కల, కోయిల్ మణవాళ మా ముని= శ్రీరంగంలోని మణవాళమహామునులయొక్క, తామరై త్తార్ వడమ్ కొణ్డ = తామరపూసలతో చేసిన మాలికలను కల్గిన, మార్బినిల్ = వక్షఃస్థలంలోని, వణ్ పురి నూలుమ్ = ఉదారమైన (గొప్ప) యజ్ఞోపవీతాన్ని, ఎనదు నెఞ్జిల్ = నా మనస్సులో, ఇడమ్ కొణ్డు = వాసస్థానంగా గ్రహించి, అడఙ్గ = అణగి ఉండేటట్లు, ఎழுదివైత్తేన్ = లిఖించివేశాను (నిలుకడగా ఉండేటట్లు చేశాను), ఇని = ఇక, వల్ వినైకాళ్ = ఓ నా ప్రబలదుష్కర్మలారా!, తీదు అఱు = మీకు ఏ కీడు లేకుండేటట్లు, తిడమ్ కొణ్డు = మనస్సులో దార్ఢ్యాన్ని పొంది, నీశర్తమ్ = నీచుల, తేయత్తిల్ = దేశంలోనికి, ఏకిడుమ్= పోయి చేరండి.

"యే కంఠలగ్నతులసీనలినాక్షమాలాః" అని చెప్పబడ్డ రీతిలో తామరపూసల మాలికలను ధరించడం విష్ణుభక్తలక్షణం. అటువంటి తామరపూసల మాలలను వరవరమునుల తమ వక్షస్థలంలో ధరించి ఉన్నారు. **"యజ్ఞోపవీతం పరమం పవిత్రమ్"** ఇత్యాదిగా కీర్తింపబడే యజ్ఞోపవీతంకూడా ఆ వక్షస్సులో ప్రకాశిస్తున్నది. ఆ సన్నివేశాన్ని దర్శించి, ధ్యానించేవారి దుష్కర్మలు అన్నీ నశిస్తాయి- అని పాశురం సారం.

అచేతనాలైన దుష్కర్మలను చేతనసమాధిలో సంబోధించి పల్కడం ఒక కవితా చమత్కృతి. పై పాశురంలో చెప్పబడ్డ త్రిదండం, ఈ పాశురంలో ప్రస్తావింపబడ్డ యజ్ఞోపవీతం- ఇవి శ్రీవైష్ణవయతులకు అసాధారణచిహ్నాలు. శ్రీవేదాంత దేశికులుకూడా యతిరాజసప్తతిలో **"ఉపవీతినమ్.....త్రిదండహస్తమ్"** అని భగవద్రామానుజులను కీర్తిస్తూ ఈ రెండు చిహ్నాలను ప్రస్తావించారు. **"ముక్కోలుమ్ వాழ్ధియే, శెయ్య మార్బుమ్ పురి నూలుమ్ వాழ్ధియే"** అని అంటూ ఈ అణ్ణన్‌కూడా వాழ్ధిత్తిరునామంలో వీటికి మంగళాశాసనాన్ని చేశారు. **"తేశ"** మనే పదం **"తేయమ్"** గా మారింది. **"తడమ్"**- తటాకం. **"తామరైకళ్‌తడఙ్గళ్ తోఱుమ్"** అని పెరియతిరుమొழி (3-10-1) ప్రయోగం.

గోదాదేవి తిరుప్పావైలో **"మాయవై..... దామోదరనై.... తూవి త్తొழుదు వాయినాల్ పాడి మనత్తినాల్ శిన్దిక్క పోయ పిழైయుమ్ పుకుదరువా నిన్ననవుమ్ తీయినిల్ తూశాకుమ్"** అని అంట భగవానుని త్రికరణశుద్ధిగా సేవిస్తే సకలపాపాలు నిప్పులో పడిన దూదివలె రూపు మాసిపోతాయని అన్నారు. వేదంకూడా **"యథేషీక తూల మగ్నౌ ప్రోతం ప్రదూయేత తథాహాస్య సర్వే పాప్మానః ప్రదూయంతే"** అని అన్నది. భగవద్విషయంతో అనుసంధింపబడ్డ ఈ భావాన్ని ఇక్కడ అణ్ణన్ ఆచార్యవిషయంగా అనుసంధించడం విశేషం.

7. మఙ్గాదులకై యరుళ్ మణవాళముని మరువార్
శిఙ్గారమాలై త్తిరుత్తోళ్‌కళుమ్ అవற்றிற் తికழుమ్
శఙ్గాழியుమ్ తొழుదేత్తినేనాల్ తమియేనుడైయ
పఙ్గాళుమ్ వల్‌వినై యెఙ్గో కణత్తినిల్పాటియవే

మఙ్గాదు = చెడకుండా ఉండేటట్లు, ఉలకై = లోకాన్ని, అరుళ్ = కటాక్షించే, మణవాళ ముని = మణవాళమునుల, మరు ఆర్ = సువాసన నిండిన, శిఙ్గారమాలై = అందమైన మాలికను ధరించిన, తిరు త్తోళ్‌కళుమ్ = అందమైన రెండు భుజాలు, అవற்றிற் = వాటిలో తికழుమ్ = ప్రకాశించే, శఙ్గు ఆழியుమ్ = శంఖాన్ని, చక్రాన్ని, తొழుదు= నమస్కరించి, ఏత్తినేన్ = స్తుతించాను, ఆల్ = ఆశ్చర్యం, తమియేనుడైయ పఙ్గు = అనన్యగతికుడను అయిన దాసుని పక్షాన్ని, ఆళుమ్ = శాసించే, వల్ వినై = బలమైన దుష్కర్మలు, కణత్తిల్ = క్షణంలో, ఎఙ్గో = ఎచటికో, పాటియ = పరుగెత్తివి. (ఏ- ఆశ్చర్యం !)

"ఎప్పోదుమ్ కైకழలా నేమియాన్ నమ్మేల్ వినై కడివాన్" (ఎల్లప్పుడు చేతిలో సుదర్శనాన్ని కలవాడు మన పాపాలను తీరుస్తాడు) అని నమ్మాழ్వార్లు కీర్తించిన రీతిలో భగవానుడు తన చేతిలోని సుదర్శనంతో మన పాపాలను తీరుస్తాడు. **"పాంచ జన్య! నిజధ్వానధ్వస్తపాతకసంచయ!"** (పాంచజన్యమా! తన ధ్వనితో పాపసమూహాలను నశింపజేసేవాడా!) అని అంటూ పంచసంస్కారసమయంలో మనం ఉచ్చరించే పాంచ జన్యస్తుతివల్ల భగవానుని శ్రీహస్తంలోని పాంచజన్యం తన ధ్వనితో సమస్తపాపాలను పోగొడుతున్నదని తెలుస్తున్నది. ప్రకృతంలో అణ్ణన్ ఈ భావాలను తమ ప్రబలపాపా లన్నీ వరవరమునుల భుజాలలో అంకితాలైన శంఖచక్రా లను దర్శించగానే నశించాయని అంటూ అనుసంధించడం విశేషం. **"యే బాహుమూల పరికర్మితశంఖచక్రాః"** అని అంటూ విష్ణుభక్తులకు చిహ్నంగా శంఖచక్ర ధారణం చెప్పబడిందికదా! **"తమియేనుడైయ"** - **"తమియేనుక్కరుళాయే"** అనే తిరువాయ్ మొழిసూక్తి స్మరణీయం. **"తమి యేనుడైయ"**- అసహాయుడనైన నాయొక్క-అని అర్థం. **"తమియన్"** ఒంటరివాడు. **"కురున్ద మొశిత్త తమియఱ్కు"** (తిరువాయ్ 6-6-8) అని ఆழ్వార్ల ప్రయోగం. **"శృంగార, లోక, క్షణ"** మనే సంస్కృతశబ్దాలు **"శిఙ్గార, ఉలకు, కణమ్"** గా మారాయి. **"ఆల్"** పాదపూరకమైన నిరర్థకావ్యయపదం. లేక, ఆశ్చర్యార్థకంగాకూడా చెప్పవచ్చు. **"మఙ్గుదల్"** నశించడం. **"మఙ్గియ మానిడ శాది"** (పెరియాழ్వార్‌తిరు- 4-6-2) ఇత్యాదిప్రయోగాలు గ్రాహ్యాలు. **"వానో! మఱికడలో! మారుతమో! తీయకమో! కానో ఒరుఙ్గిற்றుమ్ కణ్డిలమాల్, ఆనీన్టకన్టుయరత్తా మెటిన్దు కాయుదిర్త్తార్ తాళ్‌పణిన్దోమ్ ఎన్‌తుయరై యావా! మరుఙ్గు"** (అసురావిష్టం అయిన వత్సాన్ని తాను పైకి విసరి, వెలగకాయను పడగొట్టినవాని శ్రీపాదాలను ఆశ్రయించాము. మన క్రూరకర్మలు మన సమీపంలో కనబడడం లేదు. అవి ఆకాశంలోకి చేరాయా ! లేక, అలలున్న సముద్రంలోనికా! గాలిలోనా! నిప్పులోనా! అడవిలోకా! చేరాయి) అనే పెరియతిరువన్దాది (54) పాశురభావాన్ని అణ్ణన్ ప్రకృతం వరవరమునుల విషయంలో సంభావించారు. **"పావనః సర్వలోకానామ్"**, **"పవిత్రాణాం పవిత్రమ్"** ఇత్యాదిగా భగద్విషయంలో అను సంధించే సూక్తుల అర్థాలను అణ్ణన్ ఇందులో తమ ఆచార్యులపట్ల అనుసంధించారు. కనుక సకలపాపనిబర్హణరూపమైన అనిష్టనివృత్తి ఇక్కడ తెలుపబడింది.

8. మొழియుమ్ పుణైయుమ్ మణవాళముని కరుణై
పాழియు న్తిరువిழియు న్తిరుమూక్కుమ్ పాలి మఱైకళ్

శెழியனுబகொண்டைக்கு நிருனாவு நிருமுகமும்
వழி యనుబకొండ వழిత్తినేన్ పేటిని మన్నినైయే

మొழியుమ్ = పెద్దల, పూర్వాచార్యుల శ్రీసూక్తులను, తమిழ్ = ద్రావిడ వేదసూక్తులను, పునైయ = ధరించిన, మణవాళముని = మణవాళమహామునుల యొక్క, కరుణై పొழி = దయను వర్షించే, తిరు విழியుమ్ = అందమైన రెండు నేత్రాలను, తిరు మూక్కుమ్ = శ్లాఘ్యమైన నాసికను, పొలి = వర్ధిల్లే, ముతైకళ్ = ఉభయవేదాంతాలను, శెழి = (చేతనులపట్ల) సమృద్ధమైన, అనుబ కొండ్ = వాత్సల్యాన్ని కల్గి, ఉరైక్కుమ్= పలికే, తిరు నావుమ్ = అందమైన జిహ్వ, తిరు ముకముమ్ = అందమైన ముఖము- అనే వీటిని, వழి = విశేషమైన, అనుబ కొండ్ = భక్తిని కల్గి, వழిత్తినేన్ = స్తుతించాను, ఇని= ఇక, పేఱు = పరమపురుషార్థం, మన్నిను ఇలై= వేఱొకటి లేదు.

"అనుబ" అనే పదానికి వాత్సల్యం, భక్తి- అనే వేఱ్వేరు అర్థాలు సందర్భాను సారంగా చెప్పబడ్డాయి. శ్రీవరవరమునుల తిరుముఖమండలంలోని నేత్రద్వయి, నాసిక, జిహ్వ- వీటిని కల్గిన ముఖం ఇందులో కీర్తింపబడుతున్నాయి. **"కరుణై పొழిగె కణ్ణినై వాழియే"** అని అణ్ణన్ పల్కినట్లు వరవరమునుల తిరునేత్రాలు ఎపుడూ దయారసాన్ని వర్షిస్తాయి కదా! **"విపన్యవో జాగృవాంసః సమింధతే"** అని అంటూ వేదం భగవానుని దివ్యమంగళ విగ్రహాన్ని దర్శిస్తూ, మంగళాశాసనం చేయడమే పరమపురుషార్థమని అన్నట్లే అణ్ణన్ ఇందులో తమ ఆచార్యుల దివ్యమంగళవిగ్రహాన్ని సేవిస్తూ, దానిని కీర్తించడంకంటే ఉత్తమపురుషార్థం ఇంకొకటి లేదని అన్నారు. పూర్వ పాశురంలో అనిష్టనివృత్తి చెప్పబడగా ఇందులో ఇష్టప్రాప్తి తెలుపబడింది.

9. పొరునన్నినైయిలరుళాలిరున్ద నమ్బుజ్గవర్కోన్
అరుణన్నినమిழ్గాయై మా మణవాళమామునివన్
తిరునెన్నిడియు నిరునామము న్తాలున్తిరుచ్చిగైయుమ్
వరుణత్తెழిలు మనత్తినుళ్ నిన్ఱు వాழ్విక్కుమ్

పొరు నల్ తుఱైయిల్ = తామ్రపర్ణినదీయొక్క రేవు అయిన ఆழ్వార్ తిరునగరిలో, అరుళాల్ = తమ నిర్హేతుకకృపతో, ఇరున్ద = వేంచేసి ఉన్న, నమ్ = మన, పుజ్గవర్= నిత్యసూరులకు, కోన్ = నాయకులైన సేనైముదలియార్ అంశమైన నమ్మాழ్వార్లు,

అరుళ్ = అనుగ్రహించిన, నల్ = మంచి, తమిழ్ = ద్రావిడవేదాన్ని, ఉరై = వివరించే, అరుమ్ = అరుదైన, మా= గొప్ప, మణవాళమామునివన్ = మణవాళమహామునుల, తిరు నెన్నిడియుమ్ = అందమైన ఫాలభాగం, తిరు నామమ్= ఆ లలాటంలో అలంకరించుకొన్న ఊర్ధ్వపుండ్రం, తాలుమ్ = నాలుక, తిరు చ్చిగైయుమ్ = అందమైన శిఖ, వరుణత్తు= తిరుమేనిచ్ఛాయయొక్క, ఎழిలుమ్ = కాంతి, మనత్తిన్ ఉళ్ళే నిన్ఱు = మనస్సులోపల స్థిరంగా నిలచి, వాழ్విక్కుమ్ = నన్ను ఉజ్జీవింపజేస్తున్నాయి.

ఇందులో శ్రీవరవరమునుల ఉత్తమాంగశోభ అందలి పలు అంగాలను కీర్తించడంద్వారా తెలుపబడుతున్నది. **"పుజ్గవర్కోన్"**- పుజ్గవశబ్దం సంస్కృతపదం. గొప్ప పురుషుడని అర్థం. ప్రకృతంలోని సందర్భాన్నిబట్టి నిత్యసూరులను ఇది లక్షిస్తుంది. ఏనాడూ కర్మసంబంధాన్ని లేనివారుకదా వారు. వారి నాయకుడు- విష్వక్సేనుడు. అందువల్లనే సంప్రదాయంలో **"సేనైముదలియార్"** అని సేనాధిపతి, సేనానాయకుడని పేర్లు. శిఖ శ్రీవైష్ణవయతులకు అసాధారణచిహ్నం. **"శిఖయా శేఖరిణమ్ పతిం యతీనామ్"** అని యతిరాజసప్తతిలోని ప్రయోగాన్ని స్మరించాలి. భగవానుని కేశవాది నామాలను అనుసంధిస్తూ అలంకరించుకొనబడతాయి కనుక ఊర్ధ్వపుండ్రాలు నామా లనే పేరుతో వ్యవహరింపబడుతున్నాయి. **"శఠారిం సైన్యపం భజే"** అని నమ్మాழ్వార్లు సేనైముదలియార్ల అంశతో అవతరించినట్లు సంప్రదాయంలో నమ్మిక. **"శేనైయర్కోన్ అవతారమ్ శెయ్ద వళ్ళల్ వాழియే"** అని నమ్మాழ్వార్ల వాழిత్తిరునామం లోని సూక్తి. **"వరుణత్తు"**- వర్ణమనే సంస్కృతపదం వరుణంగా మారింది. ఇది ఇక్కడ శరీరవర్ణాన్ని లక్షిస్తుంది. వరవరమునుల శరీరవర్ణం సాత్వికగుణానికి ప్రతీక అయిన శ్వేతవర్ణం. దీని శోభను **"దుగ్ధోదన్వద్ధవళమధురం శుద్ధసత్త్వైకరూపం రూపం యస్య"** అని ఈ ప్రబంధకర్త అయిన అణ్ణన్ వరవరముని శతకంలో కీర్తించారు. **"తత్త సత్త్వం నిర్మలత్వాత్ ప్రకాశకమ్"** అని అంటూ గీత సత్త్వగుణంయొక్క నిర్మలత్వాన్ని, ప్రకాశస్వభావాన్ని తెలిపింది. సత్త్వగుణపూర్ణులైన వరవరమునుల దివ్యమంగళ విగ్రహవర్ణం తాను శోభిల్లడమేకాక ఆశ్రితులను కూడా శోభిల్లజేస్తుంది. **"తాలు"**- నాలుక. **"తాలాట్టు"** ఇత్యాదిప్రయోగాలు దీనికి ఉదాహరణ. **"పొరునన్నిను రైయిల్.... తమిழ్గాయై"** అనే ప్రయోగస్వారస్యాన్ని బట్టి ఈ పాశురంలోని సన్నివేశం వరవరమునులు ఈడువ్యాఖ్యను శ్రీరంగంలోని గరుడ మండపంలో శ్రీరంగనాథునకు కాలక్షేపం చెప్పే సందర్భాన్ని తలపిస్తున్నదని భావించవచ్చు.

10. వాழ்ி శెన్దామరైత్తాళ్ తువరాడై మరుఙ్గు కొప్పుழ్ీ
వాழ்ి మున్నూలుమై మార్బు ముక్కోలుమ్రై వాழ்ి తిణ్దోళ్
వాழ்ి శెవ్వాయ్ విழ்ి వాழ்ి పొన్నామ మరువు నుదల్
వాழ்ి పొఴ్కోయిన్ మణవాళమాముని వాழ்ీ ముడియే

పొన్ కోయిల్ = బంగారుమయంగా ఉండే శ్రీరంగంలో వేంచేసి ఉన్న, మణవాళ మా ముని = మణవాళమహామునుల, శెమ్ తామరై త్తాళ్ = అందమైన, తామరలవంటి శ్రీపాదాలు, వాழ்ి =క్షేమంగా ఉండాలి, తువర్ ఆడై = కాషాయ వస్త్రం, మరుఙ్గు = మధ్యప్రదేశం, కొప్పుழ్ీ = తిరునాభి, వాழ்ి = క్షేమంగా ఉండాలి, మున్నూల్ =యజ్ఞోపవీతం, ఉమై = నివసించే (ఉండే), మార్బుమ్ = వక్షఃస్థలం, ముక్కోల్ అమ్ కై = త్రిదండాన్ని ధరించిన శ్రీహస్తం, వాழ்ి = మంగళంగా ఉండాలి, తిణ్ = (భక్తులను విడువని) బలాన్ని కల, తోళ్ = భుజాలు, వాழ்ి = క్షేమంగా ఉండాలి, శెవ్వాయ్ = ఎఱ్ఱని అధరం, విழ்ి = నేత్రాలు, వాழ்ి= మంగళం, పొన్ =బంగారంవలె శ్లాఘ్యమైన, నామమ్ = తిరునామం, మరువు = పొందికగా ఉండే, నుదల్ = నొసలు (ఫాలభాగం), వాழ்ి = మంగళం, వాழ்ీ = వర్ధిల్లే, ముడి= దివ్యశిరస్సు, వాழ்ి = మంగళంగా ఉండాలి.

సింహావలోకనన్యాయంలో గత తొమ్మిది పాశురాలలో కీర్తించిన వరవర మునుల దివ్యావయవాలను అన్నిటినీ కలిపి మఱొక్క మారు అణ్ణన్ ఇందులో స్మరిస్తూ మంగళాశాసనం చేస్తున్నారు.

(శెన్దామరై త్తాళ్)- "పోద చ్చివన్దు..... పాదక్కమలఙ్గళ్" అనే సూక్తి భావం ఇందులో అనుసంధింపబడింది.

(తువరాడై)- "వానిలై ఉయ్త్త తువరాడై" - అనే ప్రయోగాన్ని స్మరించాలి.

(మరుఙ్గు)- "మణవాళయోగి తిరు మరుఙ్గుల్" అనే ప్రయోగం ఇక్కడ స్మారితం.

(కొప్పుழ్ీ)- "శుழ్ిపోల్ ఉన్దిచ్చుழ్ి" అనే ప్రయోగంయొక్క అర్థం ఇందులో స్మరింపబడింది.

(మున్నూలుమై మార్బుమ్)- "మార్బినిల్ వణ్ పురినూలుమ్" అనే ప్రయోగం స్మరణీయం.

(ముక్కోలమ్రై)- "కైత్తామరైయిల్ శేరుమ్ తిరుత్తణ్డుమ్" అనే సూక్తి భావ్యం.

(తిణ్దోళ్)- ఇందులో **"తిరుత్తోళ్కళుమ్"** అనే సూక్తి భావం అనుసంధింప బడింది. **"తిణ్ కழ్ిల్"** అనే తిరువాయ్మొழ్ిసూక్తిని వ్యాఖ్యానిస్తూ పూర్వాచార్యులు ఆశ్రితులను విడువని బలాన్ని కల్గి ఉండడం అనే అర్థాన్ని **"తిణ్"** అనే విశేషణానికి తెలుపడం ప్రకృతంలోకూడా అన్వయించడం ఉచితం. **"గజం వా వీక్ష్య సింహం వా వ్యాఘ్రం వాపి వరాంగనా, నాహారయతి సంత్రాసం బాహూ రామస్య సంశ్రితా"** అనే వాల్మీకి సూక్తిభావం వరవరమునుల విషయంలో భావింపబడింది.

(విழ்ి వాழ்ి)- "కరుణై పొழ்ియుమ్ తిరువిழ்ియుమ్" అనే భావం స్మారితం.

(పొన్నా మరువు నుదల్)- 'తిరునెऩ్ऩియుమ్ తిరునామముమ్" అనే ప్రయోగాన్ని స్మరించాలి.

(పొఴ్కోయిన్ మణవాళ(మా)ముని) - "కోయిన్ మణవాళమాముని" అనే ప్రయోగం ఆమ్రేడితం. తిరుమఙ్గైయాழ్వార్లు శ్రీరంగవిమానాన్ని స్వర్ణమయం చేశారని చరిత్రప్రసిద్ధి.

ఈ విధంగా చివరిపాశురం ప్రబంధంలో మిగిలిన తొమ్మిది పాశురాలకు సంగ్రహరూపం. **"ఇష్టం హి విదుషాం లోకే సమాసవ్యాసధారణమ్"** అన్నట్లు వక్తవ్యాంశంయొక్క సంగ్రహ విస్తరాలు విద్వాంసులకు అభిమతంకదా. శ్రీపాదాల స్తుతితో ప్రారంభం అయిన ఈ ప్రబంధం చూడాపీడవర్ణనతో తొమ్మిదవ పాశురంలో ముగియగా, ఉపసంహారరూపం అయిన ఈ పదవపాశురంలో పై దివ్యాంగాలకు నిత్యమంగళం ఆశాసింపబడింది. ఆచార్యుల తిరుమేనికి నిత్యమంగళం ఆశాసించడమే కదా శిష్యుని కర్తవ్యం. **"గురుం ప్రకాశయేద్ధీమాన్"** (బుద్ధిమంతుడను ప్రకాశింపజేయాలి) కదా **"తేశారుమ్ శిచ్చన్ అవన్ శీర్వడివై పేణు మవన్"** (తేజస్సును నిండుగా కల్గిన శిష్యుడు గురువుయొక్క దివ్యమంగళ విగ్రహాన్ని ఆదరించాలి) అనే ఉపదేశరత్తిన మాలైలోని వరవరమునుల శ్రీ సూక్తి భావ్యం.